




9వ డివిజన్.. 9 సమస్యలు

రాజమహేంద్రవరం 9వ డివిజన్ అందరికీ సుపరిచితమే.. ఎందుకంటే హైదరాబాద్ జూబ్లీహిల్స్ అంత ఫేమస్.. ఈ డివిజన్‌కు మరో పేరుంది.. అదే వెంకటేశ్వరనగర్..ఒక్కసారి ఈ నగర్‌లోకి వెళ్లామా.. చుట్టూ సమస్యలే.. రహదారులు అధ్వానం.. గోదావరి చెంతనే ఉన్నా తాగునీటికి ఇబ్బందులే.. అంతెందుకు ఒక చిన్న కల్వర్టు నిర్మాణ పనులు పూర్తికాక గత మూడు నెలలుగా రెండు వీధులకు రాకపోకలు నిలిచిపోయినా.. డ్రైనేజీ మురుగునీటి పారుదల సక్రమంగా లేక దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకున్నవారే కానరాలేదు.. ఈ చిత్రంలోనే రోడ్డు చూశారా..ఇదీ అక్కడిదే మరి.. ఈ సమస్యలు ఎలా తీరతాయో చూడాల్సిందే మరి..! - వివరాలు 6లో



పాఠకుల చెంతకే 'ఆంధ్రజ్యోతి'

అక్షరంతో ఏం చేయగలం!?
సమాజంలో చైతన్యం తేగలం..
ప్రజాగళమై పోరాటం చేయగలం..
నేతలకు దిశానిర్దేశం చేయగలం..
సమస్యలను ఎత్తిచూపగలం.. పరిష్కరించగలం..
ఇప్పటివరకూ ఆ అక్షరమే ఆంధ్రజ్యోతి బలం..
తెల్లటికాగితంపై.. నల్లటి అక్షరాలతో
ఎన్నో అద్భుతాలు సృష్టించింది..
అక్షరమనే ఆయుధంతో ఎన్నో సాధించింది..
ఇప్పుడు మరో కొత్త అడుగు వేయబోతోంది..

మంగళవారం నుంచి పాఠకుల చెంతకే వస్తోంది.. సమస్యలపై గళమెత్తబోతోంది.. రాష్ట్ర సమస్యలే కాదండోయ్.. మీ వీధి.. మీ ఊరు.. మీ వార్డు.. మీ డివిజన్.. సమస్య ఏదయినా సరే.. ప్రజలకు.. ప్రజాప్రతినిధులు.. అధికారులకు మధ్య వారధిగా నిలిచి పరిష్కారంలో భాగం కానుంది.. తొలుత ఈ కార్యక్రమాన్ని మంగళవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం 9వ డివిజన్ వెంకటేశ్వరనగర్.. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం 3వ వార్డు.. కాకినాడ జిల్లా పిఠాపురం 18వ వార్డుల్లో శ్రీకారం చుడుతోంది.. మీరు చేయాల్సిందల్లా ఒక్కటే.. మీ చెంతకు వచ్చిన ఆంధ్రజ్యోతి వద్దకు రండి.. మీకు తోడుంటాం.. మీ సమస్యలేమిటో చర్చిద్దాం..!

జయహే


ఘనంగా 76వ గణతంత్ర దినోత్సవం

ప్రజాస్వామ్య పాలనకు నాంది పలికిన రోజు : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 26(ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య పాలనకు నాంది పలికిన పవిత్రమైన రోజు గణతంత్ర దినోత్సవమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో ఆదివారం 76వ భారత గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఎస్పీ డి.నరసింహకిషోర్‌తో కలిసి గౌరవం వందనం స్వీకరించి మాట్లాడారు. జిల్లాను అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 10 సూత్రాలతో ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలకు మరింత దగ్గరగా పాలానా వ్యవస్థ ఉండే విధంగా నిర్ణయాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు.ఎన్‌టీఆర్ సామాజిక భద్రత పింఛన్లు, ఉచిత ఇసుక, అన్నా కేంటిన్లు, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్, ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాలు ప్రజలకు చేరువ చేస్తున్నామన్నారు. వసతి గృహాల్లో ప్రమాణాలు పెంచేదిశగా పనులు ప్రారంభించామన్నారు. పలు శాఖల ప్రగతిని వివరించారు. రాజమహేంద్రవరంలో జిల్లా మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో 2027 గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణను అమలుచేయడం జరుగుతుందన్నారు.తొలుత ప్రత్యేక వాహనంలో కలెక్టర్ ప్రశాంతి,ఎస్పీ నరసింహకిషోర్ పోలీస్ పరేడ్‌ను తిలకించారు. గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్వాతంత్ర సమరయోధులను కలెక్టర్ ప్రశాంతి సత్కరించారు. వేడుకల్లో పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైర్ సేఫ్టీ ప్రదర్శన ఆలోచింపజేసింది. ప్రభుత్వ శాఖల శకటాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. జిల్లాలో 17 శాఖలకు సంబంధించిన అభి వృద్ధి శకటాలను ప్రగతిని వివరిస్తూ ప్రదర్శన చేశారు.డ్రోన్లతో జాతీయ జెండాలను గాలిలో తేల్చి ప్రాంగణంలో ప్రదర్శన హైలెట్‌గా నిలిచింది. డాగ్ స్క్వాడ్ ప్రదర్శన నిర్వహించారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్



జెండా వందనం చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్







జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న కొవ్వూరు హోలీ ఏంజెల్స్ పాఠశాల చిన్నారులు



అవార్డు గ్రహీతలు వీరే..

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన పలు శాఖల ఉన్నతాధికారులు అవార్డులకు ఎంపికయ్యారు. కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్, జేసీ చిన్నరాముడు చేతులమీదుగా జిల్లా అధికారులు ఈ అవార్డులను అందుకున్నారు. సత్తెనపల్లి సరళ వందనం (పోలవరం స్పెషల్ కలెక్టర్), టి.సీతారామమూర్తి (జిల్లా రెవెన్యూ అధికారి), రమావత్ కృష్ణ నాయక్ (ఆర్డీఓ, రాజమహేంద్రవరం), డాక్టర్ రాణి సుస్మిత (ఆర్డీఓ, కొవ్వూరు), ఎస్.భాస్కరరెడ్డి (కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్)కె.లక్ష్మీజ్యోతి (ఎస్‌డీసీ ల్యాండ్ అక్విజేషన్, ఓఎన్‌జీసీ), కె.సురేష్‌కుమార్ (జైళ్లశాఖ సూపరింటెండెంట్), జే.నీరజ (వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్), కె.వాసుదేవరావు (జిల్లా విద్యాశాఖాధికారి), ఎన్‌ఎస్‌వీఎల్ నరసింహం (ఆర్ఐఓ, ఇంటర్మీడియట్ విద్య), ఎస్.శోభారాణి (ఆర్‌జేడీ, కళాశాల విద్య), ఎస్‌బీవీ రెడ్డి (ఆర్అండ్‌బీ ఎస్ఈ), బి.వెంకటగిరి (ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ), పి.వీణాదేవి (జిల్లా ఇన్‌ఛార్జి అధికారి, జీఎస్‌డబ్ల్యుఎస్), బి.తవిటి నాయుడు (చేనేత, జౌళి శాఖ అభివృద్ధి అధికారి), వాణీధర్ రామన్ (జిల్లా పరిశ్రమల అధికారి), డీవీ ప్రసాద్ (జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్), కె.వెంకటేశ్వరరావు (జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి), డాక్టర్ ఎం.లక్ష్మీ సూర్యప్రభ (సూపరింటెండెంట్, జీజీహెచ్), ఆర్.సురేష్ (డీటీవో), డి.ఫణి భూషణ్‌రెడ్డి (మైన్స్), ఎల్.అప్పలకొండ, ఎస్.మాధవరావు (జిల్లా వ్యవసాయాధికారి), బి.సుజాత కుమారి (ఉద్యాన), లావణ్య (ఎక్సైజ్), ఎన్‌వీవీఎస్ మూర్తి (పీడీ, డీఆర్‌డీఏ), ఏ.నాగమహేశ్వరరావు (పీడీ, డ్వామా), ఎం.నాగలత (డీపీవో), ఎం.పెరుమాళ్ల రావు (నైపుణ్యాభివృద్ధి), బి.శశాంక (బీసీ సంక్షేమ అధికారిణి), కేఎన్ జ్యోతి (జిల్లా ఎస్టీ సంక్షేమ అధికారిణి), కె.విజయకుమారి (ఐసీ డీఎస్), పి.నారాయణమూర్తి (దివ్యాంగుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు), ఏ.స్లీవరెడ్డి (డీఎల్‌డీవో, పీఆర్, కొవ్వూరు), ఐ.కాశయ్య (డీపీ ఆర్వో, ఐఅండ్‌పీఆర్), శ్రీనివాస్ (ఎంఎస్ఎంఈ, సిడ్బి), ఎన్.వసుంధ (జిల్లా టీబీ నియంత్రణ అధికారిణి),అడిషనల్ ఎస్పీలు (అడ్మిన్) ఎన్‌బీఎం. మురళీకృష్ణ, (లాఅండ్‌ఆర్డర్)ఎవి సుబ్బరాజు, (క్రైమ్) ఎల్.అర్జున్,(ఏఆర్) ఎల్.చెంచిరెడ్డి, ఉత్తమ డీఎస్పీలుగా జి.దేవకుమార్, ఎస్.భవ్యకిషోర్, టీవీఆర్కే.కుమార్ (ఏఆర్), సీఐలు ఎస్. మురళీకృష్ణ,వై.రాంబాబు, ఎ.శ్రీనివాసరావు, ఎస్ ఐలు వి.అప్పలరాజు,పి.మనోహర్, వి.సుబ్రహ్మణ్యం, కె.శ్రీహరిరావు, ఎస్.శివప్రసాద్, కె.జగన్మోహనరావు,పి.రవీంద్రబాబు,బీఎస్‌డీ.ప్రసాద్, వి.సత్యనారాయణ, ఎ.శివాజీ, మరొక 70 మంది ఏఎ స్ఐలు,కానిస్టేబుళ్లు అవార్డులు అందుకున్నారు.



రాజమహేంద్రవరం బీజేపీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం చిత్రంలో ఎంపీ పురందేశ్వరి, బీజేపీ నాయకులు తదితరులు



జిల్లాలో 17 శాఖలకు సంబంధించిన అభి వృద్ధి శకటాలను ప్రగతిని వివరిస్తూ ప్రదర్శన చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ శకటం ప్రథమ బహుమతిని సాధించింది.



గణతంత్ర దినోత్సవంలో భాగంగా కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్, జేసీ చిన్నరాముడు నుంచి ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆర్డీవో రమావత్ కృష్ణనాయక్





డబుల్ ఇంజన్ సర్కారుతో వేగంగా అభివృద్ధి

చాగల్లులో ఎంపీ పురందేశ్వరి

చాగల్లు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : డబుల్ ఇంజన్ సర్కార్ వల్ల రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరుగుతుందని రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. చాగల్లు మండలంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు.మార్కొండపాడులో రూ. 50 లక్షలతో నిర్మించే బ్లాక్ పబ్లిక్ హెల్త్ భవనానికి శంకుస్థాపన చేశారు. చాగల్లులో జరిగిన కొబ్బరి రైతుల సమావేశంలో పాల్గొన్నారు. కొబ్బరి బోర్డులో మన ప్రాంత రైతుల సమస్యలు చెప్పుకుని పరిష్కారం అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా పంట పొలాలకు నీరందే విధంగా కృషి చేయాలని కోరారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ సంబంధింత అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం సకాలంలో కొనుగోలు చేసి 24 గంటల్లోపే వారి ఖాతాల్లో నగదు జమ చేసిన ఘనత ఎన్‌డీఏ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.చాగల్లులో నూతనంగా నిర్మించిన రైతుసేవా కేంద్రం,మీనానగరంలో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించారు.

పీఎంశ్రీ పథకానికి 20 పాఠశాలలు

రాజానగరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సమగ్ర వికాసానికి అవసరమైన అన్ని వసతులు కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోంది. సరికొత్త సదుపాయాలతో సర్కారు బడులు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి.పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు భౌతిక, రసాయన ల్యాబ్‌లు, డిజిటల్ తరగతులు, క్రీడా మైదానాలు అభివృద్ధి, వృత్తి విద్య, నైపుణ్యాల శిక్షణ, స్కౌట్స్ అండ్ గైడ్స్ తదితర విభాగాలను అభివృద్ధి చేయనున్నారు. దీంతో పాటు విద్యార్థులకు కళలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో పీఎంశ్రీ పథకంలో భాగంగా మండలానికి ఒక హైస్కూల్ వంతున 19 మండలాల్లో 20 హైస్కూల్స్ మంజూరయ్యాయి.ఇందులో భాగంగా రసాయన, భౌతిక శాస్త్ర ల్యాబ్‌లకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు, క్రీడా మైదానాల అభివృద్ధికి ఒక్కో పాఠశాలకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. పాఠశాలల్లోని సైన్స్ ల్యాబ్‌లకు భవనాలు నిర్మించగా, మైదానంలో రన్నింగ్ ట్రాక్, బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్ కోర్టులను అభివృద్ధి చేస్తున్నారు. వృత్తి నైపుణ్యం కోసం ఉపాధ్యాయులను నియమిస్తున్నారు. రాజానగరం నియోజకవర్గంలో దివాన్‌చెరువు, కోరుకొండ,రఘుదేవపురం హైస్కూల్స్ ఎంపికయ్యాయి.నిర్మాణ పనులు జరుగుతున్నారు. పాఠశాలల్లో మైదానాల అభివృద్ధి పనులను సమగ్ర శిక్ష అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థులకు ఆసక్తి పెరిగేలా..



పీఎంశ్రీ పథకం ద్వారా పాఠశాలల్లో చేపట్టే సైన్స్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు అభివృద్ధి చేస్తున్నాం. క్రీడలకు సంబంధించి కోర్టులు తయారు చేస్తాం. వృత్తి నైపుణ్య శిక్షకులను ఏర్పాటు చేస్తాం. దీంతో విద్యార్థులకు వివిధ రంగాల్లో ఆసక్తి పెరుగుతుంది.

సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్

జిల్లాలో ఎంపికైన హైస్కూల్స్..

తూర్పుగోదావరి జిల్లాలో కోరుకొండ, రాజమహేంద్రవరం అర్బన్‌లోని గవర్నమెంట్ హైస్కూల్ ఇన్నీస్‌పేట, నల్లజర్ల మండలం అనంతపల్లి, తాళ్లపూడి మండలం అన్నదేవరపేట, బిక్కవోలు, గోపాలపురం మండలం చిట్యాల, దేవరపల్లి, రాజానగరం మండలం దివాన్‌చెరువు, అనపర్తి, గోకవరం, కడియం, పెరవలి, రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు, సీతానగరం మండలం రఘుదేవపురం, నిడదవోలు మండలం సమిశ్రగూడెం, ఉండ్రాజవరం మండలం సత్యవాడ , చాగల్లు మండలం ఊనగట్ల, రంగంపేట మండలం వడిశలేరు,కొవ్వూరు మండలం పంగిడి, కొవ్వూరు హైస్కూల్స్‌కు నిధులు మంజూరయ్యాయి.

నేడు కొవ్వూరులో పీజీఆర్ఎస్‌కు కలెక్టర్

కొవ్వూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా, డివిజన్, మండల స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా కొవ్వూరు మండల పరిధిలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొననున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించే డివిజనల్ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు. అదే సమయంలో జిల్లాస్థాయి అధికారులు సోమవారం యధావిధిగా కలెక్టరేట్‌లో హాజరవుతారన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు ఆయా ప్రధాన కేంద్రాల నుంచి పీజీఆర్ఎస్ కార్యక్రమానికి హాజరై ప్రజలనుంచి అర్జీలను స్వీకరించాలన్నారు. కొవ్వూ రు మునిసిపల్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అర్జీలను స్వీకరిస్తారు.ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్ ఆకస్మిక మృతి

సీతానగరం,జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : సీతానగరం సచివాలయం-2లో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కోన పవన్‌కుమార్ (30) ఆదివారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతిచెందాడు. కోరుకొండ మండలం జంబూపట్నం గ్రామానికి చెందిన పవన్‌కుమార్ తండ్రి మరణానంతరం ఉద్యోగంలో చేరారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఆదివారం ఇంటికి వెళ్లకుండా అమ్మమ్మగారి ఊరైన సీతానగరంలో ఉండిపోయారు. తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో కడుపునొప్పి వచ్చి వాంతులు చేసుకుని సొమ్మసిల్లి దుర్మరణం పాలైనట్టు సచివాలయ సిబ్బంది తెలిపారు. ఆయన మృతికి పంచాయతీ సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, సిబ్బంది సంతాపం తెలిపారు.

ఇది మాకు గ్రాండ్ సంక్రాంతి 5

'సంక్రాంతికి వస్తున్నాం' విజయయాత్రలో హీరో వెంకటేష్



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో భరత జాతి గొప్పదనాన్ని వివరిస్తూ విద్యార్థినుల నృత్య రూపకం



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆసనంతో ఆకట్టుకున్న విద్యార్థిని

దేశభక్తి... వెల్లువెత్తి...



కాకినాడలో భరతమాత వేషధారణలో పరేడ్‌లో పాల్గొన్న విద్యార్థిని



గణతంత్ర వేళ... సాంస్కృతిక హేల

కాకినాడ సిటీ/రాజమహేంద్రవరం సిటీ/అమలాపురం టౌన్: గణతంత్ర సంబరాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు అంబరాన్నంటాయి. కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 76వ గణతంత్ర దినోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దేశభక్తిని చాటేలా విద్యార్థులు, చిన్నారుల ప్రదర్శనలు అలరించాయి. నృత్యాలు, స్కిట్స్‌లను చూసి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆహుతులు మంత్రముగ్ధులయ్యారు.



మేరా భారత్ మహాన్ (కాకినాడలో జాతీయ జెండాతో చిన్నారి)



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో ఆకట్టుకున్న కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వలసపాకల ఎలిమెంటరీ స్కూలు విద్యార్థులు



76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా జగ్గంపేట శ్రీప్రజ్ఞ స్కూలు విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. జాతీయ పతాకావిష్కరణ అనంతరం మెయిన్‌రోడ్డులో దేశభక్తి గీతాలతో శోభాయాత్ర నిర్వహించారు.

సర్టిఫికెట్‌కు ఓ రేటు ..!

» సూరంపాలెం వీఆర్వో నిర్వాకం » కలెక్టర్‌ను ఆశ్రయించిన బాధితురాలు

గండేపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం సూరంపాలెం వీఆర్వో ప్రతి సర్టిఫికెట్‌కు ఓ రేటు నిర్ణయించినట్టు తెలిసింది. సదరు ఉద్యోగికి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సైతం వత్తాసు పలుకుతు న్నా రంటూ ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలివి... సూరంపాలెంకు చెం దిన అడ్డాల అనంతలక్ష్మికి ఐదుగురు సంతానం కాగా, వీరిలో ముగ్గురికి జనన నమోదు సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంది. అయితే గ్రామ పంచాయతీ కార్యాలయం చుట్టూ ఎన్ని ప్రదక్షిణలు చేసినా... పట్టించుకోకపోవడంతో ఆమె కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ శ్రీనివాస రావును ఆశ్రయించింది. ఆయన సహకారంతో కలెక్టర్‌కు బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీంతో కలెక్టర్ పెద్దాపురం ఆర్డీవో, గండేపల్లి తాసిల్దార్‌కు ఆదేశాలు జారీ చేయడంతో అసలు విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒక్కొక్క పత్రానికి ఐదు వేల రూపాయలు చొప్పున్న డిమాండ్ చేసినట్టు సమాచారం. అయితే ఇదే గ్రామంలోని సుమారు 40 నుంచి 50 మంది విద్యార్థులు జనన సర్టిఫికెట్ల కోసం పంచాయతీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని, వెంటనే జిల్లా అధికారులు స్పందించాలని కోరుతున్నారు. దీనిపై వీఆర్వో స్పందిస్తూ వాళ్లని లంచం అడగలేదని, సర్టిఫికెట్ ఎంక్వైరీ ఆలస్యం అవ్వడం వల్లే ఫిర్యాదు ఇచ్చారన్నారు.

న్యాయనిర్ణేతలుగా ఇద్దరు క్రీడాకారుల ఎంపిక




అడపా శ్రీనివాస్, గొలకోటి శ్రీనివాస్

అమలాపురం రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నిర్వహించే బ్యాడ్మింటన్ పోటీలకు న్యాయనిర్ణేతలుగా అమలాపురం రూరల్ మండలానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ మేరకు వారికి ఉత్తర్వులు అందాయి. ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 14 వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే నేషనల్ గేమ్స్‌లో బ్యాడ్మింటన్ పోటీలకు ఈదరపల్లి అలవైకుంఠపురం కాలనీకి చెందిన అడపా శ్రీనివాస్, కామనగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గొలకోటి శ్రీనివాస్‌ను బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ ఎంపైర్లుగా నియమించింది. గతంలో వీరిద్దరు పలు జాతీయ టోర్నమెంట్లకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. వీరిని బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అంకమ్మచౌదరి ఉమ్మడి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కొత్తపల్లి బాలు, కోనసీమ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, హెచ్‌ఎం వీ.చక్రధరరావు అభినందించారు.

పాపికొండల్లో జన సందడి

» పది పర్యాటక బోట్లు ఏర్పాటు



పాపికొండలు విహార యాత్రకు వెళ్తున్న పర్యాటక బోటు

దేవీపట్నం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): పాపికొండల అందాలను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి పర్యాటకులు ఆదివారం పెద్దసంఖ్యలో విచ్చేశారు. పది బోట్లలో సుమారు 466 మంది అందాలను తిలకించారు. ముందుగా మాతృశ్రీ గండిపోశమ్మ తల్లిని దర్శించుకుని గోదావరి పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, తొయ్యేరు, దేవీపట్నం, అగ్రహారం, మూలపాడు, మంటూరు, కొండమొదలు, తదితర గ్రామాల మీదుగా పేరంటాలపల్లికి వెళ్లారు. ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన మాతృ శ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు.

దర్శన టిక్కెట్లు, తదితర వాటి ద్వారా రూ.16,600 ఆదాయం వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

విద్యార్థులకు రాజ్యాంగ స్ఫూర్తి అవసరం

» సంవిధాన్ ర్యాలీలో మంత్రి దుర్గేష్, ఎంపీ పురంధేశ్వరి, ఎమ్మెల్యేలు



బీజేపీ సంవిధాన్ అభియాన్ ర్యాలీలో మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల , నల్లమిల్లి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకోవాలని రాజమండ్రి ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరంలో సంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. కోటిపల్లి బస్టాండు సెంటర్లోని స్వాతంత్ర్య సమరయోధుల పార్కు నుంచి గోదావరి గట్టు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టు హాలు వరకు జరిగిన ఈ ర్యాలీలో ఎంపీతోపాటు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో జరిగిన సభలో పురందేశ్వరి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగానికి అనేక సవరణలు చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ స్ఫూర్తిని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేసిందని విమర్శించారు. రాజ్యాంగానికి 41వ సవరణ చేస్తూ సెక్యులర్ అనే పదాన్ని పీఠికలో పొందుపర్చారన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం మనకు దిక్సూచి వంటిదన్నారు. సభలో బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, కోడూరి లక్ష్మీనారాయణ, పరిమి రాధ, బొమ్ముల దత్తు, వీరా వీరాంజనేయులు, హారిక, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్, తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఎంపీ పురందేశ్వరి స్వాతంత్ర్య సమరయోధుల పార్కులోని 12 మంది మహిళా స్వాతంత్ర్యయోధుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఏపీ సాంస్కృతిక నాటక పరిషత్ సమాఖ్య అధ్యక్షుడు వెంకట రామారావు

పెద్దాపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంచంద్రమాంపల్లి (దివిలి)లో స్నేహఆర్ట్స్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట స్థాయి ఆహ్వాన నాటికల పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల రాష్ట్రస్థాయి నాటిక పోటీల్లో చివరి రోజు ముఖ్య అతిథిగా ఏపీ సాంస్కృతిక నాటక పరిషత్ సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకటరామారావు హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేసి రాజా, ఇంధన బ్రహ్మానందం, కొత్తిం స్వామినాథన్, దేవాడ పాపేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అమరావతి ఆర్ట్స్ (గుంటూరు) ఆధ్వర్యంలో ప్రదర్శించిన చిగురు మేఘం నాటిక ఎంతగానో ఆకట్టుకుంది. ఈ నాటికను కావూరి సత్యనారాయణ రచన చేయగా, ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించారు. మిత్రా క్రియేషన్స్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఇది రహదారి కాదు నాటిక అలరించింది. ఈ నాటికను ఆకురాతి భాస్కరచంద్ర రచించగా ఎంఎం బాషా దర్శకత్వం వహించారు. స్నేహఆర్ట్స్ (చంద్రమాంపల్లి) ప్రదర్శించిన 'చచ్చిన నాటిక' ఆకట్టుకుంది. నాటికకు రచన బర్రే సత్యనారా యణ చేయగా ఎం.సుబ్బు దర్శకత్వం వహించారు.

వాఘా సరిహద్దులో మోతుగూడెం యూత్



వాఘా బోర్డర్‌లో జాతీయ జెండాతో మోతుగూడెం యువకులు

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం యువకులు ఇండియా-పాకిస్తాన్ సరిహద్దు వాఘాలో రిపబ్లిక్ డే వేడుకలు జరుపుకున్నారు. యూత్ సభ్యులు ఎండీ జాకీర్, సందీప్, పలుకూరి రామరాజు, చింతా వినోద్, పరిమళ హేమంత్ జాతీయ జెండాను ఎగురవేసి భారతీయులుగా గర్వపడుతున్నామని చెప్పారు. ఈ సంఘటన తమ జీవితంలో అత్యంత విలువైనదని పేర్కొన్నారు.


- మోతుగూడెం (ఆంధ్రజ్యోతి)

చెట్టుకు ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం పాత బొమ్మూరుకి చెందిన మర్రి రాజారత్నకుమార్ (23) అనే యువకుడు తన ఇంటికి సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన మద్యానికి బానిసై ఇంట్లో గొడవలు పడి రెండుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కానీ అతని తల్లిదండ్రులు కాపాడుకున్నారు. ఈ క్రమంలో విజయవాడలో ఉంటున్న పెద్ద కుమారుడు ఇంటికి శనివారం తల్లిదండ్రులు వెళ్లారు. దీంతో మానసిక సమస్యలతో బాధపడుతున్న రాజారత్నకుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారిపై .. ట్రాలీ లారీ బోల్తా

- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం



ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

దివాన్‌చెరువు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి దివాన్‌చెరువు సమీపంలో ఆదివారం ఇనుప ఊచల లోడ్‌తో వెళ్తున్న ట్రాలీ బోల్తా పడింది. డ్రైవర్ అప్రమత్తతంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బొమ్మూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఎస్‌ఐ ఎస్.పి కుమార్ వివరాలు తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్‌లో ఇరుకున్న డ్రైవర్ మహ్మద్ ఆదిల్‌ను బయటకు తీశారు.

అతిపెద్ద పర్వతాన్ని.. అధిరోహించిన ఆచంట ఉమేష్



మౌంట్ కోజిస్కో పర్వతంపై జెండాతో ఉమేష్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ పర్వతారోహకుడు ఆచంట ఉమేష్ ఆస్ట్రేలియా ఖండంలోనే అతిపెద్ద పర్వతాన్ని అధిరోహించాడు. రిపబ్లిక్ డే సందర్భంగా మౌంట్‌కో జిస్కోను అధిరోహించి జాతీయ జెండాను ప్రదర్శించాడు. ఈ పర్వతం ప్రపంచంలో ఏడు ఖండాల్లో అతి పెద్దది. దీనిఎత్తు 2228 మీటర్లు, ఉమేష్ స్పెషల్ పర్మిషన్ తీసుకుని గైడ్ లేకుండా సొంతంగా వెళ్లాడు.



భారీ ట్రాలీ

84 టైర్లతో జాతీయ రహదారిపై ఒడిశా వైపు పయనం

పిఠాపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 216పై ట్యాంకర్‌ను తీసుకెళ్తున్న భారీ ట్రాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాకినాడ నుంచి ఒడిశా వెళ్తున్న ఈ ట్రాలీకి 84 టైర్లు ఉన్నాయి. తిమ్మాపురం వద్దకు శనివారం చేరిన ఈ ట్రాలీ పిఠాపురం బైపాస్ రోడ్డుకు ఆదివారం చేరుకుంది. పిఠాపురం-గొల్లప్రోలు మధ్య టోల్‌గేట్ దాటే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించారు. టోల్‌గేటు దాటిన తర్వాత సాయంత్రం వరకు ట్రాలీని అక్కడే నిలిపి ఉంచగా ప్రజలు ఆసక్తిగా తిలకించారు.



విరవాడలో 250 అడుగుల జాతీయ జెండా

పిఠాపురం రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం విరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 250 అడుగుల జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహించారు. పతాకంతో గ్రామ వీధుల్లో ర్యాలీ జరిపారు.



వాలీబాల్ టోర్నమెంటు లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

ఫిబ్రవరి 26 నుంచి గొల్లవిల్లిలో ఏఎస్ఆర్ నేషనల్ వాలీబాల్ టోర్నమెంటు

ఉప్పలగుప్తం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి జడ్పీ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో నాలుగు రోజులపాటు నిర్వహించనున్న అరిగెల శ్రీరంగయ్య జాతీయ ఇన్విటేషన్ వాలీబాల్ పోటీల లోగోను గొల్లవిల్లిలోని అరిగెల వెంకటనరసింహారావు గృహ ప్రాంగణంలో టోర్నమెంటు గౌరవాధ్యక్షుడు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదివారం ఆవిష్కరించారు. టోర్నమెంటు అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగినమీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1988 నుంచి వాలీబాల్ జాతీయ పోటీలు నిర్వహిస్తూ గొల్లవిల్లి ప్రత్యేక గుర్తింపు పొందిందని వివరించారు. త్వరలో జిల్లాలో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేస్తామన్నారు. గొల్లవిల్లి టోర్నమెంటుకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. టోర్నమెంటు అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఫిబ్రవరి 26 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు టోర్నమెంటు జరుగుతుందన్నారు. వాలీబాల్ నేషనల్ ఫెడరేషన్‌లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. ఫ్లడ్ లైట్ వెలుగుల్లో డే అండ్ నైట్ పోటీలు నిర్వహించనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఆముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, టోర్నమెంటు ముఖ్య సలహాదారు అరిగెలనానాజీ, సాంకేతిక సలహాదారు వుండ్రు రాజబాబు, ఉపాధ్యక్షులు మద్దింశెట్టి సురేష్, సలాది నాగరాజు, ప్రధాన కార్యదర్శి అరిగెల నరేష్, కార్యనిర్వాహక కార్యదర్శి, పీడీ గొలకోటి ఫణీంద్రకుమార్, కోశాధికారి గనిశెట్టి తాతాజీ, సంయుక్త కార్యదర్శులు గుత్తుల శ్రీనివాస్, గుత్తాల సుభాష్‌చంద్రరావు, కార్యవర్గ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇది మాకు గ్రాండ్ సంక్రాంతి

'సంక్రాంతికి వస్తున్నాం' విజయ యాత్రలో హీరో వెంకటేష్, డైరెక్టర్ అనిల్ రావిపూడి



శ్యామల థియేటర్లో ప్రేక్షకులకు అభివాదం చేస్తున్న హీరో, డైరెక్టర్

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): 'సంక్రాంతికి వస్తున్నాం' మాకు గ్రాండ్ సంక్రాంతి అయ్యిందని ఆ చిత్ర హీరో విక్టరీ వెంకటేష్, డైరెక్టర్ అనిల్ రావిపూడి ఆనందం వ్యక్తం చేశారు. విజయ యాత్రలో భాగంగా ఈ చిత్రం ప్రదర్శితమవుతున్న శ్యామల థియేటర్‌కి హీరో వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్ మీనాక్షి చౌదరి, నటుడు శ్రీనివాసరెడ్డి, నిర్మాత శిరీష్ ఆదివారం మార్నింగ్ షో సమయంలో విచ్చేశారు. వారికి మైత్రి ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ ప్రతినిధులు ఉదయరాజు, సత్తిరెడ్డి డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికి పుష్పమాలలతో సత్కరించారు. చిత్ర యూనిట్ సభ్యులను థియేటర్లోకి తీసుకెళ్లి ప్రేక్షకులను పరిచయం చేశారు. ప్రేక్షకులకు అభివాదం చేస్తూ పలకరిస్తూ సినిమా గురించి స్పందన తెలుసుకున్నారు. సినిమాను విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం థియేటర్ ఆవరణలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో హీరో వెంకటేష్ మాట్లాడుతూ ప్రేక్షకులంతా ఈ సినిమాను బాగా ఆదరిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. గోదావరి యాసతో మాట్లాడడం సినిమాకు బాగా కలిసివచ్చిందన్నారు. గోదావరి జిల్లాలు సినిమా షూటింగ్‌లకు అనుకూలమన్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ తమ కాంబినేషన్లో ఎఫ్2 నుంచి చూస్తే ఇది మూడవ సినిమా అని.... 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు పెద్ద హిట్ ఇచ్చారన్నారు. బుల్లిరాజు పాత్ర డైలాగ్స్‌లో ఎలాంటి కాంట్రవర్సీ లేదన్నారు.ఆ డైలాగ్స్ కోసమే ప్రేక్షకులు సినిమాను ఐదారుసార్లు చూసి బాగా ఎంజాయ్ చేస్తున్నారన్నారు. నిర్మాత శిరీష్ మాట్లాడుతూ ఈ సినిమాకు అన్నిచోట్లా మంచి టాక్ ఉందని, ముఖ్యంగా తూర్పు గోదావరిలో అద్భుత స్పందన ఉందని, ఇక్కడ వసూళ్లు రూ.10 కోట్లు దాటాయన్నారు. హీరోయిన్ మీనాక్షి చౌదరి మాట్లాడుతూ ఈ సినిమా తనకు పెద్ద హిట్ ఇచ్చిందన్నారు. అనంతరం వెంకటేష్, రానా అభిమానులు కోరుమిల్లి రాజశేఖర్, జాన హనుమంతరావు నేతృత్వంలో అభిమానులతో కలిసి హీరో వెంకటేష్ కేక్ కట్ చేశారు.



55 ఏళ్ల అనంతరం పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

ఎన్నేళ్లో వేచిన ఉదయం

పెద్దాపురం వీర్రాజు హైస్కూల్లో ఏడు పదుల వయసులో విద్యార్థుల కలయిక



నాటి గురువును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

పెద్దాపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఏరా ఎలా ఉన్నావు.... ఏమి చేస్తున్నావు... ఎక్కడ ఉంటు న్నావు.... ఇలా ఒకరికొకరు ఆప్యాయం గా పలకరించుకుంటూ ఏడు పదుల వయసులో ఉన్నవారంతా సందడి చేశారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలోని వీర్రాజు హైస్కూల్లో 1969-70 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పుడు చేసిన చిలిపి పనులను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ఏడు దశాబ్దాల తర్వాత కలవడంతో ఉద్విగ్నభరిత వాతావరణంలో ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పరవశించిపోయారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన కంభంపాటి గౌరీపతి శాస్త్రి, డ్రిల్ మాస్టర్ స్టీవెన్‌సన్‌లను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం విందు భోజనాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ ముప్పన శ్యామలాంబ, వీర్రాజు, యెండ్రు రామారావు, ముత్యాల రాజబ్బాయి, చల్లా విశ్వనాథం, దుర్గా మోహన్‌రావు, జెట్టి రాజబ్బాయి, మలిరెడ్డి సత్యనారాయణ, తోట మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ కొట్టించుకుని .. స్కాన్ చేస్తుండగా

- మోటార్ సైకిల్‌తో ఆగంతకుడు పరార్
- చేబ్రోలు పెట్రోల్ బంకులో నాటకీయ పరిణామం



చేబ్రోలు పెట్రోల్ బంకు నుంచి పరారవుతున్న వ్యక్తి(సీసీ కెమెరాల్లో)

గొల్లప్రోలురూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ కొట్టించుకొని డబ్బులు చెల్లించేందుకు ఫోన్‌తో స్కాన్ చేస్తుండగా ఓ ఆగంతకుడు మోటార్‌సైకిల్‌తో పరారయ్యాడు. ఈ నాటకీయ పరిణామం కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు హెచ్‌పీ పెట్రోల్ బంకులో ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని తాటిపర్తికి చెందిన గారపాటి వెంకట్రాజు తన మోటార్‌సైకిల్‌తో చేబ్రోలు శివారులో 216వ జాతీయరహదారిలో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకులో పెట్రోల్ కొట్టించుకునేందుకు మధ్యాహ్నం 11.52 గంటల సమయంలో వెళ్లాడు. పెట్రోల్ కొట్టించుకుని డబ్బు లు చెల్లించేందుకు మోటార్‌సైకిల్‌ను పార్క్ చేసి స్కానర్ వద్దకు వెళ్లాడు. ఇంతలో నిక్కరు వేసుకుని షర్ట్ లేకుండా పిచ్చివాడిగా తిరుగుతున్న వ్యక్తి ఆ మోటార్‌సైకిల్‌ను తీసుకుని పరారాయ్యాడు. ఈ మేరకు గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మోటార్‌సైకిల్ తీసుకుని పరారవుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. కాగా మోటార్‌సైకిల్ చోరీ చేసిన వ్యక్తి ఆదివారం రాత్రి విశాఖ-శ్రీకాకుళం రోడ్డులో ఎడ్ల బండిని ఢీకొట్టినట్టు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుల్లో ... ఒకరి మృతి

ముమ్మిడివరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో గాయపడ్డ నలుగురు యువకుల్లో ఒకరు ఆదివారం మృతిచెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం యలకల్లంకకు చెందిన వడ్డి సిరాజ్, ముమ్మిడివరం మండలం అనాతవరానికి చెందిన తాడి పల్లంరాజు మోటారు సైకిల్‌పై శనివారం అమలాపురం నుంచి ముమ్మిడివరం వైపు వెళ్తున్నారు. అదే సమయంలో మలికిపురానికి చెందిన నల్లి వంశీ, గెద్దాడ మణికంఠ మోటారు సైకిల్‌పై కాకినాడ నుంచి మలికిపురం వెళ్తున్నారు. ఈ క్రమంలో ముమ్మిడివరం బైపాస్ రోడ్డు వై.జంక్షన్‌లో వారి వాహనాలు ఢీకొన్నాయి. దీంతో క్షతగాత్రులను అమలాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే వడ్డి సిరాజ్ పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. మిగిలిన ముగ్గురు చికిత్స పొందుతున్నారు. ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీతానగరం వెల్ఫేర్ అసిస్టెంట్ ఆకస్మిక మృతి



సీతానగరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సీతానగరం సచివాలయం -2లో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కోన పవన్‌కుమార్ (30) ఆదివారం తెల్లవారు జామున ఆకస్మికంగా మృతిచెందాడు. సుమారు నాలుగు గంటల ప్రాంతంలో కడుపునొప్పి రావడంతో వాంతులు చేసుకొని ప్రాణం విడిచినట్టు సచివాలయ సిబ్బంది తెలిపారు. కోరుకొండ మండలం జంబూపట్నంకి చెందిన పవన్ .. తండ్రి మరణాంతరం ఉద్యోగంలో చేరాడు. ఆయన మృతికి పంచాయతీ సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, సిబ్బంది సంతాపం వ్యక్తపరిచారు.

'రియల్' మోసం

- జనాల సొమ్ము రూ.నాలుగు కోట్లు వసూలు చేసి వ్యక్తి ఉడాయింపు
- మోసపోయాం.. న్యాయం చేయాలంటూ బాధితుల వేడుకోలు
- మాచవరంలో వ్యాపారి ఇంటి ఎదుట ధర్నా



వెంకటరెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

రాయవరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానంటూ ప్రజలను నమ్మబలికి రూ. నాలుగు కోట్లతో ఓ మోసగాడు ఉడాయించాడు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం మాచవరంలో ఘటన జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మాచవరం పల్లపువీధి రామాలయం సమీపంలో కర్రి వెంటరెడ్డి అలియాస్ దత్తుడు అలియాస్ దొరబాబు అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. ప్రజలతో నమ్మకంగా మెలిగిన సదరు వెంకటరెడ్డి తనకు కాకినాడలో డీమార్ట్ సమీపంలో భూములు ఉన్నాయని, కాకినాడ మున్సిపాలిటీలో ఒక ఉద్యోగి ద్వారా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నానని, పెట్రోల్ బంక్, తదితర వ్యాపారాలు ఉన్నాయంటూ నమ్మబలికాడు. దీంతో మాచవరం, అనపర్తి మండలం వులుగుర్త గ్రామాలకు చెందిన సుమారు 45 మంది రైతులు, తదితర వారి వద్ద నుంచి సొంత అవసరాలు, కుమార్తె పెళ్లి ఖర్చుల నిమిత్తం నగదు రూ. నాలుగు కోట్లు అప్పుగా తీసుకున్నాడు. అప్పులు ఇచ్చిన వ్యక్తులకు వెంకటరెడ్డి మూడు నెలలుగా తిరిగి సొమ్ములు చెల్లించకపోవడంతో అనుమానం వచ్చింది. దీంతో గ్రామపెద్దల్లో పెట్టి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని వారంతా వాపోయారు. ఈ క్రమంలో ఆదివారం వెంకటర్‌రెడ్డి ఇంటి ఎదుట బాధితులంతా ధర్నాకు దిగారు. తమ పిల్లల చదువు, పెళ్లిళ్ల నిమిత్తం దాచుకున్న సొమ్ములను ఇప్పించాలని వేడుకుంటున్నారు. ఈ సంఘటనపై రాయవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.



పూజా కార్యక్రమంలో భక్తులు

లోవకు పోటెత్తిన భక్తులు

ఆలయానికి రూ. 3.12 లక్షల ఆదాయం

తుని రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తూర్పు కనుమల్లో కొలువై ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు వేలాదిగా పోటెత్తారు.తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి జనం రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రత్యేక క్యూలైన్లలో బారులు తీరారు. దర్శనం అనంతరం కుటుంబ సమేతంగా ఆదివారం ఒక్కరోజే వివిధ విభాగాలద్వారా రూ. 3.12 లక్షల ఆదాయం సమకూరినట్టు ఉప కమిషనర్, ఆలయ ఈవో పి.విశ్వనాథరాజు తెలిపారు.


వేడుకగా సత్యదేవుడి ఆర్జిత రథసేవ



రథోత్సవంలో సహాయ కమిషనర్ రామ్మోహనరావు

అన్నవరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడు సత్యదేవుడి వారాంతపు ఆర్జిత రథసేవను ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను టేకు రథంపైకి తెచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల గోవిందనామస్మరణ, పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ తూర్పు రాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి భీమవరానికి చెందిన భక్తుడు జీ.సోమవెంకట కార్తీక్ రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందించారు. ఈ సందర్భంగా ఆయన్ని అభినందించి, స్వామివారి ప్రత్యేక దర్శనం, ప్రసాదాన్ని బహూకరించారు.

ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు



పతాకానికి వందనం సమర్పిస్తున్న బీఎం శ్రీనివాసరావు, ఎడిషన్ ఇన్‌చార్జి బీహెచ్‌వీ మంగేష్, సిబ్బంది

దివాన్‌చెరువు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దేశ రాజ్యాంగ విశిష్టతను ప్రతిఒక్కరూ గౌరవించాలని, అది మనందరి కర్తవ్యమని ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రాజానగరం మండలం దివాన్‌చెరువులోని యూనిట్ కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఎం మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజున ఈ వేడుకను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎడిషన్ ఇన్‌ఛార్జి బీహెచ్‌వీ మంగేష్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కుల వల్లే నేడు మనం స్వేచ్ఛా జీవితాన్ని అనుభవిస్తున్నామన్నారు. జిల్లా స్టాఫర్ ఎస్.ఎస్.ఎన్. సత్యనారాయణ మాట్లాడుతూ అందరికీ విద్య అవసరమని, దీనితోనే జీవితంలో మార్పు సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సర్క్యులేషన్ మేనేజర్ బీ. గోపాలకృష్ణ, ఏబీఎన్ రిపోర్టర్ కే.రాజాబాబు, సబ్‌ఎడిటర్లు వీజీ మహేశ్వరరావు, జీ.శేషగిరిరావు, ఎస్.రవికుమార్, సిస్టమ్ ఇన్‌ఛార్జి ఎన్.శివకుమార్, రిపోర్టర్ కాదంబరి శ్రీనివాస్, ఫొటోగ్రాఫర్ ఎస్.రాంబాబు, ఏబీఎన్ కెమెరామెన్ సతీష్, యాడ్స్ విభాగం నుంచి ఎం.రవీంద్ర, బీవీ సుబ్రహ్మణ్యం, వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది జి.వీరభద్రరాజు, శివ, కిరణ్, సంతోష్, టి.శ్రీనివాస్, డీ.మహేష్, సెక్యూరిటీ సూపర్‌వైజర్ కే. సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న 126 కిలోల గంజాయి పట్టివేత



నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మోతుగూడెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో 126 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి.. ఎస్ఐకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న చెక్‌పోస్టు వద్ద వాహనాలను ఆపి తనిఖీ చేస్తుండగా అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఆరుగురిని పట్టుకొని అరెస్టు చేశారు. వీరంతా తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లాలోని కొత్తపల్లికి చెందిన మేరుగు సాదయ్య, పైడి చింతలపల్లికి చెందిన రంగు రమేష్, గుర్రం సురేష్, మల్లాపురానికి చెందిన వడ్ల రాజీర్, జగిత్యాల జిల్లా మల్లాపురానికి చెందిన గుడ్ల చంద్రశేఖర్, హనుమాన్‌వాడ భోగా అనిల్‌కుమార్. రెండు కారుల్లో వచ్చారు. గంజాయి విలువ రూ.6.30 లక్షలు ఉంటుందని పోలీసులు చెప్పారు. తనిఖీల్లో ఎస్ఐ కే. శివనారాయణ, ఏఎస్ఐ రాజేశ్వరరావు, హెచ్‌సీఎస్ పురుషోత్తం, కొండబాబు, పీసీ సన్యాసిరావు, ఏఆర్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి



రాయవరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాయవరం మండలం పసలపూడి వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న తాతపూడి అబ్బాయి (57) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. వీఆర్వో కుమారుడు తులసీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంతకాలంగా అబ్బాయి అనారోగ్యంతో బాధపడుతున్నట్టు కుటుంబీకులు చెప్పారు. ఈయనకి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు తులసీధర్ వెదురుపాక గ్రామ వ్యవసాయ సహాయకుడిగా పని చేస్తున్నారు. అబ్బాయి అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన ఆలమూరు మండలం నవాబుపేటలో నిర్వహించారు. వీఆర్వో మృతిపట్ల తహశీల్దారు ఐపీ శెట్టి, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

అక్షరం అండగా..
పరిష్కారమే అజెండాగా..
ఆంధ్రజ్యోతి



9వ డివిజన్ సమస్యలు

పట్టణం : రాజమహేంద్రవరం
డివిజన్ : 9
కాలనీ : వెంకటేశ్వరనగర్, బర్మాకాలనీ, విద్యుత్ కాలనీ, కోకా భాస్కర్‌నగర్, జయశ్రీ గార్డెన్స్, ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్, జిల్లా పోలీస్ కార్యాలయం, తారక రామానగర్ 2వ వీధి
ఓటర్లు : 10 వేలు
సమస్యలివీ : రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, అపారిశుధ్యం



వెంకటేశ్వరనగర్‌లో గోతులతో అధ్వానంగా తయారైన రహదారులు



గత టీడీపీ ప్రభుత్వంలో ట్యాంక్ ప్రారంభం..అయినా నేటికీ ఇలా

ఆ కాలనీ పైకి చూస్తే హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్.. లోపలకు వెళ్లి చూస్తే మాత్రం మురికివాడకంటే కాస్త బెటర్.. నడవడానికి దారుండదు.. తాగడానికి నీళ్లుండవు.. మురుగు వెళ్లే దారుండదు.. రోడ్డు పక్కన తప్ప చెత్త వేసుకునేందుకు చోటుండదు.. కాలనీ బయట ఎంతో ఉన్నతంగా ఉన్నా లోపలమాత్రం చుట్టూ అధ్వానమే.. ఒకటా రెండా ఏకంగా 9 సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. అయినా జనానికి ఆ కాలనీని వదిలి వెళ్లే ధైర్యముండదు. అలవాటుపడిపోయిన ప్రాణాలు ఎక్కడికిపోతాయి.. చుట్టూ సమస్యలున్నా ఆ కాలనీనే పట్టుకుని వేలాడుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేసి వాటర్ ట్యాంక్ నిర్మాణం ప్రారంభించినా నేటికీ అది పూర్తికాలేదంటే వైసీపీ పాలనలో ఐదేళ్లూ ఏం అభివృద్ధి జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఇదీ రాజమహేంద్రవరం 9వ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో దుస్థితి..



అసంపూర్తిగా వదిలేసిన డ్రైనేజీ

- పేరుకే అఫీషియల్ కాలనీ..చుట్టూ సమస్యలే
- రహదారులన్నీ అధ్వానమే
- బర్మాకాలనీకి అందని తాగునీరు
- డ్రైనేజీల్లో అపారిశుధ్యం
- నెలల తరబడి నిర్మాణంలోనే కల్వర్టు
- రోడ్లపైనే ప్రవహిస్తున్న మురుగు
- ఇదీ రాజమండ్రి వెంకటేశ్వరనగర్ దుస్థితి

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మేడిపండు చూడ మేలిమై ఉండు.. పొట్ట విప్పి చూడ పురుగులుండు అన్నట్టు.. అచ్చంగా ఆ కాలనీ కూడా అలాగే ఉంటుంది. అది రాజమహేంద్రవరంలో ఆఫీషియల్‌గా కనిపించే వెనుకబడిన ప్రాంతం. ఎత్తయిన భవనాలు, పార్కులు, విశాలంగా కనిపించే వీధులతో పైకి చూస్తే అద్భుతంగా కనిపిస్తుంది. కానీ ఒక సారి లోపలకు వెళ్లి చూశామా పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్టు ఉంటుంది. భౌగోళికంగా రాజమహేంద్రవరంలోనే ఎత్తయిన ప్రదేశంలో ఉండే 9వ డివిజన్ నేటికీ అభివృద్ధిలో వెనుకబడే ఉంది. గత పాలకులు నిర్లక్ష్యం వల్ల 9వ డివిజన్‌లో 9 ప్రధాన సమస్యలకు పరిష్కారం లభించక కొట్టుమిట్టాడుతున్నాయి. వెంకటేశ్వర నగర్‌లో రహదారులు అధ్వానం, డ్రైనేజీ వ్యవస్థ దారుణం. పారిశుధ్య కార్మికుల కొరత ఉంది. చెరుకూరి కల్యాణ మండపం ఎదురుగా కల్వర్టు నిర్మాణానికి సుధాకర్ ఇన్‌ఫ్రా సిబ్బంది గోతులు తవ్వి మూడు నెలలు గడిచినా ఇంకా పూర్తికాలేదు. దీంతో రెండు వీధులకు సంబంధించి రాకపోకలు నిలిచిపోయాయి. కల్వర్టు నిర్మాణానికి డ్రైనేజీలను బ్లాక్ చేయడంతో మురుగునీరు రోడ్డెక్కుతోంది. దేవస్థానం భూమిని డంపింగ్ యార్డుగా మార్చివేశారు. విద్యుత్ కాలనీలో రెండు వీధులకు రహదారులు, డ్రైనేజీలు సమస్య ఉంది.16, 19 సచివాలయాలు చేరువగా లేక ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారు. ఏకేసీ కళాశాల ప్రాంత ప్రజలు ప్రతి పనికి విద్యుత్ కాలనీకి వెళ్లే పరిస్థితి ఉంది. జయశ్రీ గార్డెన్స్, కోకభాస్కరనగర్ లోను డ్రైనేజీలు రహదారులు సమస్యలు ఉన్నాయి. అయినా నేటి వరకూ పరిష్కారానికి నోచుకోలేదు. ఎన్నో ఏళ్లగా సమస్యలు కాలనీవాసులను వెంటాడుతూనే ఉన్నాయి. గత ఐదేళ్ల కిందట అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం సమస్యలపై దృష్టి సారించింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కాలనీ అభివృద్ధి మాటే మరచింది. దీంతో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయి. రహదారులు అధ్వానంగా ఉన్నాయి.

బర్మాకాలనీకి తాగునీరేది..

తాగునీటి సమస్య అధికంగా ఉంది. రెండు వీధులకు తాగునీటి సరఫరాలేదు. ఫలితంగా వాటర్ ట్యాంక్‌పై ఆధారపడ్డారు. ట్యాంకర్ రాకపోతే తాగడానికి నీరుండదు. పారిశుధ్య సమస్య ఉంది. ఇంటింటా చెత్త సేకరణకు సీఎన్‌జీ వాహనాల కొరత ఉంది. ఇక్కడ కమ్యూనిటీ హాలులేదు. అంగన్‌వాడీకి ప్రత్యేక భవనం లేదు.

పార్కు ప్రైవేట్ పరం

గత పాలకులు వెంకటేశ్వరనగర్ వాటర్ ట్యాంక్ పక్కనే నగరపాలక సంస్థ స్థలంలో నిర్మించిన పార్కును ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. దీంతో లోపలకు సాధారణ ప్రజలు వెళ్లే పరిస్థితి లేదు. గతంలో మేయర్‌గా ఆదిరెడ్డి వీర రాఘవమ్మ ఉన్న సమయంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి పార్కు స్థలం కేటాయించా రు. ప్రకాశం నగర్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటి లిమిటెడ్‌కు కమ్యూనిటీ హాలు నిర్మించేందుకు అప్పటి మంత్రి దివంగత జక్కంపూడి రామ్మోహనరావు శంకుస్థాపన చేశా రు. అదే స్థలంలో పార్కును అభివృద్ధి చేసి దానిని ప్రైవేట్ సంస్థ కు అప్పగించారు. గత టీడీపీ ప్రభు త్వంలో వాటర్ ట్యాంక్‌కు 15వ ఆర్థికసం ఘం నిధులతో శంకుస్థాపన చేసారు. ఇప్పుడు వాటర్ ట్యాంక్ నిర్మాణం జరుగుతుండగా పార్కు మాత్రం ప్రైవేట్ సంస్థ చేతిలోకి వెళ్లింది.

చెత్త సేకరణ సక్రమంగా లేదు



విద్యుత్ కాలనీలో చెత్తసేకరణ సక్రమంగాలేదు. రోజుల తరబడి చెత్తను నిల్వచేయలేక రోడ్లపై వేసే పరిస్థితి ఉంది. డ్రైనేజీలు శుభ్రం చేసి చాలా రోజులైంది. చాలా సార్లు అధికారులకు పారిశుధ్యంపై ఫిర్యాదులు చేసినా స్పందన లేదు.

- పసుపులేటి మధు కిషోర్, విద్యుత్ కాలనీ

గోదావరి నీళ్ల సమస్య ఉంది..



బర్మాకాలనీలో గోదావరి నీళ్ల సమస్య ఉంది.గతంలో సమస్యను అప్పటి ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని దృష్టికి తీసుకువెళ్లాం.కేవలం బోరు నీటి పైనే ఆధారం. కానీ గోదావరి నీళ్లు సమృద్ధిగా లేవు.. కుళాయిలు పెంచాలి. కాలనీలో పందులు, కుక్కల బెడద అధికంగా ఉంది. శానిటేషన్ బాగోలేదు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్వయంగా దగ్గర ఉంటేనే పని జరుగుతుంది. లేకపోతే లేదు.

- నెల్లి సరస్వతి,గృహిణి, కుమారస్వామి వీధి

ఆ మూడు రోడ్లు వేయాలి..



వెంకటేశ్వరనగర్‌లో ఐఎంఏ హాలు ఉన్న రహదారి, దానికి అటుఇటు ఉన్న కొన్ని రహదారులు వేయడంలేదు. కనెక్టింగ్‌గా ఉన్న రహదారులు కల్వర్టుల నిర్మాణానికి తవ్వేశారు. ఇది జరిగి సు మారు 3నెలలు కావొస్తుంది. ఇప్పటికి వాటి నిర్మాణం పూర్తి కాలేదు.దీని వల్ల వెంకటేశ్వర నగర్ లోకి రావాలంటేనే ఇబ్బందిగా ఉంది.

- డాక్టర్ కే సంహిత్ వర్మ, వెంకటేశ్వరనగర్



జేఎన్ రోడ్డులో డ్రైనేజీ నిర్మాణం నిలిపివేయడంతో నిలిచిపోయిన మురుగునీరు

గత పాలకులు వ్యవస్థలను భ్రష్టుపట్టించారు..



9వ డివిజన్‌ను గత వైసీపీ పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. అనేక సమస్యలు ఉన్నాయి. రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ బాగోలేదు. పారిశుధ్యం సన్నగిల్లింది. తాగునీటికి ఇబ్బంది తప్పడంలేదు. వేసవి కాలం వచ్చిందంటే గోదావరి పక్కనే ఉన్నా గొంతు తడవడమే కష్టంగా ఉంది. వ్యవస్థలన్నింటిని గత ప్రభుత్వం నాశనం చేసింది. ఇప్పుడిప్పుడే ఎమ్మెల్యే వాసు వాటిని సరిచేసుకుంటూ వస్తున్నారు. తప్పక అతిత్వరలో 9వ డివిజన్‌లో సమస్యలన్నింటికి పరిష్కారం దొరుకుందనే నమ్మకం నాకు ఉంది.

- కోసూరి చండీప్రియ, మాజీ కార్పొరేటర్ 9వ డివిజన్



జేఎన్ రోడ్డులో పేరుకుపోయిన చెత్తలో పందుల సంచారం

రాజ్యాంగ విలువలను కాపాడుకోవాలి

• ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి • ఘనంగా గణతంత్ర దినోత్సవం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత గిరిజన ప్రజాసంఘాలు



అనపర్తిలో జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



కోరుకొండలో జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

అనపర్తి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ విలువలను కాపాడుకునే విధంగా ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రామవరం గ్రామ పంచాయతీ కార్యాలయం, రెవెన్యూ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాలలో జరిగిన గణతంత్ర వేడుకలలో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనపర్తిలోని ఏరియా ఆసుపత్రివద్ద సూపరిండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ వారా కుమారి, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ శ్రీను నాయక్ జెండా ఆవిష్కరణ చేశారు. తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి కూటమి నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మామిడిశెట్టి శ్రీను, మల్లిడి ఆదినారాయణరెడ్డి, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల సిబ్బంది, పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: 76వ భారత గణతంత్ర దినోత్సవం రాజమహేంద్రవరంలో ఆదివారం ఘనంగా జరిగింది. జిల్లా కలెక్టరు కార్యాలయంలో జాతీయ జెండాను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ఎగురవేశారు.తొలుత పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మహాత్మగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, చిత్రపటాలకు పూలమాలతో నివాళు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో టి.సీతారామరామూర్తి, జిల్లా వ్యవసాయఅధికారి ఎస్.మాధవరావు, సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ, ఏవో ఆలీ తదితరులు పాల్గొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో జాతీయ జెండాను కమిషనర్ కేతన్ గార్గ్ ఎగురవేశారు. జిల్లా పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో జాతీయ జెండాన డీపీఆర్వో ఐ.కాశియ్య, సీహెచ్ శ్రీనివాస్, డివిజనల్ పీఆర్‌వో లక్ష్మణాచార్యులు ఎగురవేశారు. హెడ్ పోస్టాఫీసులో జాతీయ జెండాను సూపరింటెండెంట్ కె.శేషారావు ఎగురవేశారు. భాష్యం బ్లూమ్స్‌లో గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగింది. జాతీయ జెండాను చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్మన్ పద్మావతి భవరాజు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జెడీఈవో వరలక్ష్మి, ఈస్ట్ జోన్ -2జేడీఈవో ఆంజనేయులు ప్రిన్సిపాల్ పాల్గొన్నారు. దళిత గిరిజన సంఘాల ఆధ్వర్యంలో క్వారీ సెంటర్ నుంచి గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మర్రిబాబ్జి, ఓఎన్జీసీ రిటైర్డ్ ఈడీ డీఎంఆర్ శేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్‌లు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ తన కార్యాలయంలో గణతంత్ర వేడకలు నిర్వహించారు.

విద్యార్థులు విలువలనూ పెంపొందించుకోవాలి

దివాన్‌చెరువు: విద్యార్థులు విద్య, ఉద్యోగ, ఉపాధి నైపుణ్యాలతోపాటు విలువలను పెంపొందించుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో ఆదివారం గణతంత్రదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథి వీసీ హాజరై ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థుల గౌరవవందనాన్ని స్వీకరించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ మహనీయులను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి పాటుపడాలని అన్నారు. విశ్రాంత నేవీ కమాండర్ ఎస్.కృష్ణకుమార్ మాట్లాడుతూ దేశాభివృద్ధి యువత చేతుల్లో ఉందన్నారు. దివాన్‌చెరువులోని రాష్ట్ర అటవీ అకాడమీలో డైరెక్టర్ బి.విజయకుమార్‌జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. దివాన్‌చెరువులోని బీజాపురి టౌన్‌షిప్‌లోని రాజరాజేశ్వరిగుడి వద్ద పార్క్‌లో జాతీయజెండా ఆవిష్కరించారు.

గోకవరం: మండలంలో పలు ప్రభుత్వ ప్రవేట్ కార్యాలయాల వద్ద జాతీయ జెండా రెపరెపలాడింది. ఎంపీడీవో కార్యాలయంవద్ద ఎంపీడీవో గోవిందు, రెవెన్యూ కార్యాలయంవద్ద తహశీల్దారు సాయిప్రసాద్, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ పవన్‌కుమార్, ప్రభుత్వాసుపత్రివద్ద వైద్యాధికారిణి వనజాకుమారి, విద్యుత్ కార్యాల యంవద్ద ఏఈ సుబ్రహ్మణ్యం, ఆర్టీసీ డిపో వద్ద డిపో మేనేజర్ యు.రామన్న, ఎంఆర్‌సీ కార్యాలయంవద్ద ఎంఈవో గౌరమ్మ జెండాను ఆవిష్కరించారు.

కోరుకొండ: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని యువతను అన్నిరంగాల్లో నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్లో ఆదివారం జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అశోక్‌కుమార్, ఎంఈవో టి.కుశలవదొర, విద్యాకమిటీ చైర్మన్ తెలగంశెట్టి శివ, సర్పంచ్‌లు కర్రి లక్ష్మిస రోజ, జాజుల రాము, తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వి.శ్రీనివాస్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సత్యకృష్ణ, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రవిచంద్రకుమార్ పతాకావిష్కరణలు చేశారు. ఇళ్లపల్లి ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో విద్యార్థులకు శంకరనారాయణ డిక్షనరీలు పంపిణీ చేసామని హెచ్ఎం పప్పు శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల్లోను జాతీయ పతాకాలను ఎగురవేసి గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు.

రాజానగరం: రాజానగరంతో పాటు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రైవేటు విద్యాసంస్థలు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంవద్ద ఎంపీడీవో జేఏ ఝాన్సీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ ఏంజిల్, ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీడీపీవో టి.నాగమణి, పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయు)లో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తూర్పు గోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ కళ్లం ఉపేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కానవరంలోని గాయత్రి విద్యాసంస్థల్లో కరస్పాండెంట్ మూర్తి పతాకాన్ని ఆవిష్కరించారు.

రాజమహేంద్రవరంరూరల్: రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కుమార్ మువ్వన్నెల జండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీటీ చైతన్య, ఎంఆర్ఐ ప్రసాద్, చందు, వీఆర్‌వోలు పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎండీవో శ్రీనివాసరావు జండా ఆవిష్కరించారు. వైటీసీ ప్రాంగణంలో డ్వామా కార్యాలయంలో డ్వామా పీడీ నాగమహేశ్వరరవు జండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యాలయం ఏవో కిషోర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధనాసంస్థలో ఘనంగా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. సంస్థ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాదవ్ జాతీయ జెండాను ఎగురవేశారు.

సీతానగరం: మండలంలోని ప్రతి గ్రామంలోను రిపబ్లిక్‌డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సీతాగనరం సబ్ రిజిష్ట్రారు వారి కార్యాలయంలో సబ్ రిజిష్ట్రార్ ఐహెచ్ఆర్‌కె ప్రసాద్ సిబ్బంది జండా వందనం చేశారు. మండల పరిషత్ కార్యాలయం రెవెన్యూ కార్యాలయం, పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాల వద్ద జండా వందనం నిర్వహించారు.

కడియం: కడియం మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు వద్ద గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని జండా వందనం చేశారు. దామిరెడ్డిపల్లిలో సర్పంచ్ ముద్రగడ సత్యస్వరూప, ఉపసర్పంచ్ ముద్రగడ జమీ లు జండా వందనం చేశారు. కడియపులంక ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులతో కలిపి సంవిధాన్ సమ్మాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు బొర్సు సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ పంతం గణపతి, మాజీ ఎంపీపీ మార్గాని లక్ష్మిసత్యనారాయణ, నాగుల పల్లి వీరబాబు, తదితరులు పాల్గొన్నారు. జేగురుపాడులో సర్పంచ్ యాదల స్టాలిన్, ఉపసర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ, ఆకుల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు. వేమగిరిలో ఎన్టీఆర్, ఘంటసాల అభి మాని ప్రత్తిపాటి నల్లరాజు ఆధ్వర్యంలో గణతం త్ర దినోత్సవం జరిగింది. బొర్రా సుబ్బారావు, మర్రి సుబ్రహ్మణ్యం, వాసంశెట్టి నాగబాబు, సాయిరామ్ ఆటోయూనియన్ సభ్యులు పాల్గొన్నారు. వేమగిరితోట ప్రాథమిక పాఠశాలలో గణతంత్ర దినోత్సవం జరిగింది.హెచ్ఎం కె.జయరాజు, యనమదలరాజు, కాండ్రేగుల సత్తిబాబు పాల్గొన్నారు.

వడిశలేరులో ఎమ్మెల్యే సహపంక్తి భోజనం

రంగంపేట: గౌరవ్ సంవిధాన్ అభియాన్ యోజన కార్యక్రమంలో భాగంగా రంగంపేట మండలం వడిశలేరు దళితవాడలో దళితులతో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సహపంక్తి భోజనం చేశారు. ముందుగా గణతంత్ర దినోత్సవంగా సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆళ్ళ గోవింద్, అనపర్తి నియోజకవర్గ, రంగంపేట మండలం, వడిశలేరు గ్రామ ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రంగంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం, ఎంపీడీవో సాయిబాబు ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

రాజమహేంద్రవరం కల్చరల్: ఆంధ్రకేసరి డిగ్రీ కళాశాలలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి త్రివర్ణ పతాకాన్నిఎగురవేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ జక్కంపూడి విజయలక్ష్మి జాతీయ జండా ను ఆవిష్కరించారు. రాజమహేంద్రవరం తూర్పు రైల్వే స్టేషన్ వెనుక గల ది సౌత్‌సెంట్రల్ రైల్వే భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ అసిస్టెంట్ కమీషనర్ కార్యాలయం నందు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గొందేశి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రణాళికలు

• రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల



నేషనల్ హైవే విభాగం పీడీ రవీంద్రబాబుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరంరూరల్ జనవరి 26: రాబోయే పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని జాతీయ రహదారులపై ప్రమాదాలు నివారించే విధ ంగా ప్రణాళికలు చేస్తున్నామని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. పలు అంశాలపై చర్చించారు. ఆయన మాట్లా డుతూ నూతనంగా మంజూరైన వేమగిరి, లాలా చెరువు ఫ్లైవోవర్ పనులను త్వరితగతిన మొదలు పెట్టాలని, వీటితో పాటు బొమ్మూరు జంక్షన్‌ను బ్లాక్ జోన్‌గా గుర్తించి నూతన ఫ్లైఓవర్‌ను ఏర్పాటుచేయాలని, హుకుంపేట, ఏవీ అప్పారావు రోడ్డు జంక్షన్లను కూడా బ్లాక్ జోన్‌లుగా గుర్తించి సర్వీస్ రోడ్లతో పాటు అండర్ పాస్‌లు నిర్మించాలని, లాలాచెరువు ఫ్లైవోవర్‌ను ఏవీ అప్పారావు రోడ్డువరకు పొడిగించాలని, కడియపులంక, బుర్రిలంక, వేమగిరి, భూలోకమ్మ ఆలయం, ఇండస్ట్రీయల్ కాలనీ తదితర ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ టైప్ కల్వర్టులను తొలగించి వాటిస్థానంలో బ్లాక్స్ కల్వర్టులను ఏర్పాటు చేయాలని, పొట్టిలంక నుంచి రాజానగరం వరకు అనేక కల్వర్టర్ల వద్ద పూడికలు పేరుకుపోయాయని వాటిన తొలగించాలని జాతీయ రహదారిపై లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



వైజాగ్‌లో మంత్రి లోకేష్‌ను కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పర్యటకు వచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఆదివారం రాత్రి రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. దావోస్ విజయవంతం కావడంపై శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఆదిరెడ్డి వాసు కార్యాలయం ఒకప్రకటన విడుదల చేసింది

జిల్లా ఇంజనీరింగ్ అసిస్టెంట్ల యూనియన్ అధ్యక్షుడిగా సుధీర్

అనపర్తి, జనవవరి 26(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల జిల్లా యూనియన్ అధ్యక్షుడిగా అనపర్తి 4వ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పెదపూడి సుదీర్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం యూనియన్ సమావేశంలో సుధీర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అగ్నిప్రమాదంలో పెంకుటిల్లు దగ్ధం

సీతానగరం, జనవరి26: అగ్నిప్రమాదంలో పెంకుటిల్లు పూర్తిగా దగ్ధమైన సంఘటన మండలంలో ని రఘుదేవపురంలో చోటుచేసుకుంది. రఘుదేవపురానికి చెందిన మేడ సత్యనారాయణ పెంకుటిల్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్రిప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు.

వ్యక్తికి 14 రోజుల రిమాండ్

బిక్కవోలు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): సత్తెమ్మపేటకు చెందిన మహిళపై మంత్రి అప్పన్న అసభ్యకరంగా ప్రవర్తించడంతో అనపర్తి కోర్టు అతనికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ రవిచంద్రకుమార్ తెలిపారు. అప్పన్న తరచూ ఆమెను ఇబ్బంది పెడుతుండగా గతంలో తమకు ఫిర్యాదు చేసిందని, శుక్రవారం ఆమె పనికి వెళ్తుండగా ఆమె కుడి చేతిని నరకడంతో గాయాలయ్యాయని దీంతో అప్పన్నను అరెస్టుచేసికోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించారి ఎస్ఐ వివరించారు.

బాలకృష్ణకు పద్మభూషణ్‌పై గన్నివేడుక




కేక్ కట్ చేస్తున్న గన్నికృష్ణ

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ తనయుడు ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణకు కేంద్రప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు ప్రకటించడం పట్ల టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ ఆనందం వ్యక్తం చేశారు. కంబాలచెరువు వద్ద తన కార్యాలయంలో కేక్ కట్‌చేసి బాలయ్య అభిమానులతో ఆనందం పంచుకున్నారు. అవార్డు ప్రకటించిన కేంద్రప్రభుత్వానికి, ప్రధాని మోదీకి, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి గన్నికృష్ణ కృతజ్ఞతలుతెలిపారు.

బాలకృష్ణకు పద్మభూషణ్ అభినందనీయం

అనపర్తి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎమ్మెల్యే, బసవతారకం కేన్సర్ హాస్పిటల్ ట్రస్టు చైర్మన్ నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ ప్రకటించడం అభినందనీయమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బాలకృష్ణకు పద్మభూషణ్ ప్రకటించిన సందర్భంగా ఆదివారం రాత్రి అనపర్తి మండలం పొలమూరులో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కేక్ కట్‌చేసి బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



9వ డివిజన్.. 9 సమస్యలు

రాజమహేంద్రవరం 9వ డివిజన్ అందరికీ సుపరిచితమే.. ఎందుకంటే హైదరాబాద్ జూబ్లీహిల్స్ అంత ఫేమస్.. ఈ డివిజన్‌కు మరో పేరుంది.. అదే వెంకటేశ్వరనగర్..ఒక్కసారి ఈ నగర్‌లోకి వెళ్లామా.. చుట్టూ సమస్యలే.. రహదారులు అధ్వానం.. గోదావరి చెంతనే ఉన్నా తాగునీటికి ఇబ్బందులే.. అంతెందుకు ఒక చిన్న కల్వర్టు నిర్మాణ పనులు పూర్తికాక గత మూడు నెలలుగా రెండు వీధులకు రాకపోకలు నిలిచిపోయినా.. డ్రైనేజీ మురుగునీటి పారుదల సక్రమంగా లేక దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకున్నవారే కానరాలేదు.. ఈ చిత్రంలోనే రోడ్డు చూశారా..ఇదీ అక్కడిదే మరి.. ఈ సమస్యలు ఎలా తీరతాయో చూడాల్సిందే మరి..! - వివరాలు 6లో



పాఠకుల చెంతకే 'ఆంధ్రజ్యోతి'

అక్షరంతో ఏం చేయగలం!?
సమాజంలో చైతన్యం తేగలం..
ప్రజాగళమై పోరాటం చేయగలం..
నేతలకు దిశానిర్దేశం చేయగలం..
సమస్యలను ఎత్తిచూపగలం.. పరిష్కరించగలం..
ఇప్పటివరకూ ఆ అక్షరమే ఆంధ్రజ్యోతి బలం..
తెల్లటికాగితంపై.. నల్లటి అక్షరాలతో
ఎన్నో అద్భుతాలు సృష్టించింది..
అక్షరమనే ఆయుధంతో ఎన్నో సాధించింది..
ఇప్పుడు మరో కొత్త అడుగు వేయబోతోంది..

మంగళవారం నుంచి పాఠకుల చెంతకే వస్తోంది.. సమస్యలపై గళమెత్తబోతోంది.. రాష్ట్ర సమస్యలే కాదండోయ్.. మీ వీధి.. మీ ఊరు.. మీ వార్డు.. మీ డివిజన్.. సమస్య ఏదయినా సరే.. ప్రజలకు.. ప్రజాప్రతినిధులు.. అధికారులకు మధ్య వారధిగా నిలిచి పరిష్కారంలో భాగం కానుంది.. తొలుత ఈ కార్యక్రమాన్ని మంగళవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం 9వ డివిజన్ వెంకటేశ్వరనగర్.. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం 3వ వార్డు.. కాకినాడ జిల్లా పిఠాపురం 18వ వార్డుల్లో శ్రీకారం చుడుతోంది.. మీరు చేయాల్సిందల్లా ఒక్కటే.. మీ చెంతకు వచ్చిన ఆంధ్రజ్యోతి వద్దకు రండి.. మీకు తోడుంటాం.. మీ సమస్యలేమిటో చర్చిద్దాం..!



ఘనంగా 76వ గణతంత్ర దినోత్సవం

ప్రజాస్వామ్య పాలనకు నాంది పలికిన రోజు : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 26(ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య పాలనకు నాంది పలికిన పవిత్రమైన రోజు గణతంత్ర దినోత్సవమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో ఆదివారం 76వ భారత గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఎస్పీ డి.నరసింహకిషోర్‌తో కలిసి గౌరవం వందనం స్వీకరించి మాట్లాడారు. జిల్లాను అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 10 సూత్రాలతో ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలకు మరింత దగ్గరగా పాలనా వ్యవస్థ ఉండే విధంగా నిర్ణయాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు.ఎన్‌టీఆర్ సామాజిక భద్రత పింఛన్లు, ఉచిత ఇసుక, అన్నా కేంటిన్లు, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్, ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాలు ప్రజలకు చేరువ చేస్తున్నామన్నారు. వసతి గృహాల్లో ప్రమాణాలు పెంచేదిశగా పనులు ప్రారంభించామన్నారు. పలు శాఖల ప్రగతిని వివరించారు. రాజమహేంద్రవరంలో జిల్లా మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేల ఆద్వర్యంలో 2027 గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణను అమలుచేయడం జరుగుతుందన్నారు.తొలుత ప్రత్యేక వాహనంలో కలెక్టర్ ప్రశాంతి,ఎస్పీ నరసింహకిషోర్ పోలీస్ పరేడ్‌ను తిలకించారు. గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్వాతంత్ర సమరయోధులను కలెక్టర్ ప్రశాంతి సత్కరించారు. వేడుకల్లో పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైర్ సేఫ్టీ ప్రదర్శన ఆలోచింపజేసింది. ప్రభుత్వ శాఖల శకటాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. జిల్లాలో 17 శాఖలకు సంబంధించిన అభి వృద్ధి శకటాలను ప్రగతిని వివరిస్తూ ప్రదర్శన చేశారు.డ్రోన్లతో జాతీయ జెండాలను గాలిలో తేల్చి ప్రాంగణంలో ప్రదర్శన హైలెట్‌గా నిలిచింది. డాగ్ స్క్వాడ్ ప్రదర్శన నిర్వహించారు.





గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్



జెండా వందనం చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న కొవ్వూరు హోలీ ఏంజెల్స్ పాఠశాల చిన్నారులు





స్వాతంత్ర్య సమరయోధుడికి కలెక్టర్ సత్కారం

అవార్డు గ్రహీతలు వీరే..

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన పలు శాఖల ఉన్నతాధికారులు అవార్డులకు ఎంపికయ్యారు. కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్, జేసీ చిన్న రాముడు చేతులమీదుగా జిల్లా అధికారులు ఈ అవార్డులను అందుకున్నారు. సత్తెనపల్లి సరళ వందనం (పోలవరం స్పెషల్ కలెక్టర్), టి.సీతారామమూర్తి (జిల్లా రెవెన్యూ అధికారి), రమావత్ కృష్ణ నాయక్ (ఆర్డీఓ, రాజమహేంద్రవరం), డాక్టర్ రాణి సుస్మిత (ఆర్డీఓ, కొవ్వూరు), ఎస్.భాస్కరరెడ్డి (కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్)కె.లక్ష్మీజ్యోతి (ఎస్‌డీసీ ల్యాండ్ అక్విజేషన్, ఓఎన్‌జీసీ), కె.సురేష్‌కుమార్ (జైళ్లశాఖ సూపరింటెండెంట్), జే.నీరజ (వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్), కె.వాసుదేవరావు (జిల్లా విద్యాశాఖాధికారి), ఎన్‌ఎస్‌వీఎల్ నరసింహం (ఆర్‌ఐఓ, ఇంటర్మీడియట్ విద్య), ఎస్.శోభారాణి (ఆర్‌జేడీ, కళాశాల విద్య), ఎస్‌బీవీ రెడ్డి (ఆర్‌అండ్‌బీ ఎస్ఈ), బి.వెంకటగిరి (ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ), పి.వీణాదేవి (జిల్లా ఇన్‌ఛార్జి అధికారి, జీఎస్‌డబ్ల్యుఎస్), బి.తవిటి నాయుడు (చేనేత, జౌళి శాఖ అభివృద్ధి అధికారి), వాణీధర్ రామన్ (జిల్లా పరిశ్రమల అధికారి), డీవీ ప్రసాద్ (జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్), కె.వెంకటేశ్వరరావు (జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి), డాక్టర్ ఎం.లక్ష్మీ సూర్యప్రభ (సూపరింటెండెంట్, జీజీహెచ్), ఆర్.సురేష్ (డీటీవో), డి.ఫణి భూషణ్‌రెడ్డి (మైన్స్), ఎల్.అప్పలకొండ, ఎస్.మాధవరావు (జిల్లా వ్యవసాయాధికారి), బి.సుజాత కుమారి (ఉద్యాన), లావణ్య (ఎక్సైజ్), ఎన్‌వీవీఎస్ మూర్తి (పీడీ, డీఆర్‌డీఏ), ఏ.నాగమహేశ్వరరావు (పీడీ, డ్వామా), ఎం.నాగలత (డీపీవో), ఎం.పెరుమాళ్ల రావు (నైపుణ్యాభివృద్ధి), బి.శశాంక (బీసీ సంక్షేమ అధికారిణి), కేఎన్ జ్యోతి (జిల్లా ఎస్టీ సంక్షేమ అధికారిణి), కె.విజయకుమారి (ఐసీ డీఎస్), పి.నారాయణమూర్తి (దివ్యాంగుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు), ఏ.శ్లీవరెడ్డి (డీఎల్‌డీవో, పీఆర్, కొవ్వూరు), ఐ.కాశయ్య (డీపీ ఆర్వో, ఐఅండ్‌పీఆర్), శ్రీనివాస్ (ఎంఎస్ఎంఈ, సిబ్డి), ఎన్.వసుంధ (జిల్లా టీబీ నియంత్రణ అధికారిణి),అడిషనల్ ఎస్పీలు (అడ్మిన్) ఎన్‌బీఎం. మురళీకృష్ణ, (లాఅండ్‌ఆర్డర్)ఎవి సుబ్బరాజు, (క్రైమ్) ఎల్.అర్జున్,(ఏఆర్) ఎల్.చెంచిరెడ్డి, ఉత్తమ డీఎస్పీలుగా జి.దేవకుమార్, ఎస్.భవ్యకిషోర్, టీవీఆర్కే.కుమార్ (ఏఆర్), సీఐలు ఎస్. మురళీకృష్ణవై.రాంబాబు, ఎ.శ్రీనివాసరావు, ఎస్ ఐలు వి.అప్పలరాజు,పి.మనోహర్, వి.సుబ్రహ్మణ్యం, కె.శ్రీహరిరావు, ఎస్.శివప్రసాద్, కె.జగన్మోహనరావు,పి.రవీంద్రబాబు,బీఎస్‌డీ.ప్రసాద్, వి.సత్యనారాయణ, ఎ.శివాజీ, మరొక 70 మంది ఏఎ స్ఐలు,కానిస్టేబుళ్లు అవార్డులు అందుకున్నారు.



రాజమహేంద్రవరం బీజేపీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం చిత్రంలో ఎంపీ పురందేశ్వరి, బీజేపీ నాయకులు తదితరులు



జిల్లాలో 17 శాఖలకు సంబంధించిన అభి వృద్ధి శకటాలను ప్రగతిని వివరిస్తూ ప్రదర్శన చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ శకటం ప్రథమ బహుమతిని సాధించింది.



గణతంత్ర దినోత్సవంలో భాగంగా కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్, జేసీ చిన్నరాముడు నుంచి ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఆర్డీవో నాగరాజు నాయక్





డబుల్ ఇంజన్ సర్కారుతో వేగంగా అభివృద్ధి

చాగల్లులో ఎంపీ పురందేశ్వరి

చాగల్లు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : డబుల్ ఇంజన్ సర్కార్ వల్ల రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరుగుతుందని రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. చాగల్లు మండలంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు.మార్కొండపాడులో రూ.50 లక్షలతో నిర్మించే బ్లాక్ పబ్లిక్ హెల్త్ భవనానికి శంకుస్థాపన చేశారు. చాగల్లులో జరిగిన కొబ్బరి రైతుల సమావేశంలో పాల్గొన్నారు. కొబ్బరి బోర్డులో మన ప్రాంత రైతుల సమస్యలు చెప్పుకుని పరిష్కారం అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా పంట పొలాలకు నీరందే విధంగా కృషి చేయాలని కోరారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ సంబంధింత అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం సకాలంలో కొనుగోలు చేసి 24 గంటల్లోపే వారి ఖాతాల్లో నగదు జమ చేసిన ఘనత ఎన్‌డీఏ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.చాగల్లులో నూతనంగా నిర్మించిన రైతుసేవా కేంద్రం,మీనానగరంలో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించారు.

పీఎంశ్రీ పథకానికి 20 పాఠశాలలు

రాజానగరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సమగ్ర వికాసానికి అవసరమైన అన్ని వసతులు కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోంది. సరికొత్త సదుపాయాలతో సర్కారు బడులు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి.పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని ప్రవేశ పెట్టింది. దీనిలో భాగంగా పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు భౌతిక, రసాయన ల్యాబ్‌లు, డిజిటల్ తరగతులు, క్రీడా మైదానాలు అభివృద్ధి, వృత్తి విద్య, నైపుణ్యాల శిక్షణ, స్కౌట్స్ అండ్ గైడ్స్ తదితర విభాగాలను అభివృద్ధి చేయనున్నారు. దీంతో పాటు విద్యార్థులకు కళలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో పీఎంశ్రీ పథకంలో భాగంగా మండలానికి ఒక హైస్కూల్ వంతున 19 మండలాల్లో 20 హైస్కూల్స్ మంజూరయ్యాయి.ఇందులో భాగంగా రసాయన, భౌతిక శాస్త్ర ల్యాబ్‌లకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు, క్రీడా మైదానాల అభివృద్ధికి ఒక్కో పాఠశాలకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. పాఠశాలల్లోని సైన్స్ ల్యాబ్‌లకు భవనాలు నిర్మించగా, మైదానంలో రన్నింగ్ ట్రాక్, బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్ కోర్టులను అభివృద్ధి చేస్తున్నారు. వృత్తి నైపుణ్యం కోసం ఉపాధ్యాయులను నియమిస్తున్నారు. రాజానగరం నియోజకవర్గంలో దివాన్‌చెరువు, కోరుకొండ,రఘుదేవపురం హైస్కూల్స్ ఎంపికయ్యాయి.నిర్మాణ పనులు జరుగుతున్నారు. పాఠశాలల్లో మైదానాల అభివృద్ధి పనులను సమగ్ర శిక్ష అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థులకు ఆసక్తి పెరిగేలా..



పీఎంశ్రీ పథకం ద్వారా పాఠశాలల్లో చేపట్టే సైన్స్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు అభివృద్ధి చేస్తున్నాం. క్రీడలకు సంబంధించి కోర్టులు తయారు చేస్తాం. వృత్తి నైపుణ్య శిక్షకులను ఏర్పాటు చేస్తాం. దీంతో విద్యార్థులకు వివిధ రంగాల్లో ఆసక్తి పెరుగుతుంది.

సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్

జిల్లాలో ఎంపికైన హైస్కూల్స్..

తూర్పుగోదావరి జిల్లాలో కోరుకొండ, రాజమహేంద్రవరం అర్బన్‌లోని గవర్నమెంట్ హైస్కూల్ ఇన్నీస్‌పేట, నల్లజర్ల మండలం అనంతపల్లి, తాళ్లపూడి మండలం అన్నదేవరపేట, బిక్కవోలు, గోపాలపురం మండలం చిట్యాల, దేవరపల్లి, రాజానగరం మండలం దివాన్‌చెరువు, అనపర్తి, గోకవరం, కడియం, పెరవలి, రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు, సీతానగరం మండలం రఘుదేవపురం, నిడదవోలు మండలం సమిశ్రగూడెం, ఉండ్రాజవరం మండలం సత్యవాడ , చాగల్లు మండలం ఊనగట్ల, రంగంపేట మండలం వడిశలేరు,కొవ్వూరు మండలం పంగిడి, కొవ్వూరు హైస్కూల్స్‌కు నిధులు మంజూరయ్యాయి.

నేడు కొవ్వూరులో పీజీఆర్‌ఎస్‌కు కలెక్టర్

కొవ్వూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా, డివిజన్, మండల స్థాయి పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా కొవ్వూరు మండల పరిధిలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొననున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించే డివిజనల్ పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు. అదే సమయంలో జిల్లాస్థాయి అధికారులు సోమవారం యథావిధిగా కలెక్టరేట్‌లో హాజరవుతారన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు ఆయా ప్రధాన కేంద్రాల నుంచి పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి హాజరై ప్రజలనుంచి అర్జీలను స్వీకరించాలన్నారు. కొవ్వూ రు మునిసిపల్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అర్జీలను స్వీకరిస్తారు.ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్ ఆకస్మిక మృతి

సీతానగరం,జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : సీతానగరం సచివాలయం-2లో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కోన పవన్‌కుమార్ (30) ఆదివారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతిచెందాడు. కోరుకొండ మండలం జంబూపట్నం గ్రామానికి చెందిన పవన్‌కుమార్ తండ్రి మరణానంతరం ఉద్యోగంలో చేరారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఆదివారం ఇంటికి వెళ్లకుండా అమ్మమ్మగారి ఊరైన సీతానగరంలో ఉండిపోయారు. తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో కడుపునొప్పి వచ్చి వాంతులు చేసుకుని సొమ్మసిల్లి దుర్మరణం పాలైనట్టు సచివాలయ సిబ్బంది తెలిపారు. ఆయన మృతికి పంచాయతీ సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, సిబ్బంది సంతాపం తెలిపారు.

వాడపల్లి వస్తుండగా టైర్ ఫంక్చర్ వ్యాన్ బోల్తా..ఆరుగురికి గాయాలు 5

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం




9వ డివిజన్ సమస్యలు

పట్టణం : రాజమహేంద్రవరం
డివిజన్ : 9
కాలనీ : వెంకటేశ్వరనగర్, బర్మాకాలనీ, విద్యుత్ కాలనీ, కోకా భాస్కర్‌నగర్, జయశ్రీ గార్డెన్స్, ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్, జిల్లా పోలీస్ కార్యాలయం, తారక రామానగర్ 2వ వీధి
ఓటర్లు : 10 వేలు
సమస్యలివీ : రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, అపారిశుధ్యం



వెంకటేశ్వరనగర్‌లో గోతులతో అధ్వానంగా తయారైన రహదారులు



గత టీడీపీ ప్రభుత్వంలో ట్యాంక్ ప్రారంభం..అయినా నేటికీ ఇలా

ఆ కాలనీ పైకి చూస్తే హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్.. లోపలకు వెళ్లి చూస్తే మాత్రం మురికివాడకంటే కాస్త బెటర్.. నడవడానికి దారుండదు.. తాగడానికి నీళ్లుండవు.. మురుగు వెళ్లే దారుండదు.. రోడ్డు పక్కన తప్ప చెత్త వేసుకునేందుకు చోటుండదు.. కాలనీ బయట ఎంతో ఉన్నతంగా ఉన్నా లోపలమాత్రం చుట్టూ అధ్వానమే.. ఒకటా రెండా ఏకంగా 9 సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. అయినా జనానికి ఆ కాలనీని వదిలి వెళ్లే ధైర్యముండదు. అలవాటుపడిపోయిన ప్రాణాలు ఎక్కడికిపోతాయి.. చుట్టూ సమస్యలున్నా ఆ కాలనీనే పట్టుకుని వేలాడుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేసి వాటర్ ట్యాంక్ నిర్మాణం ప్రారంభించినా నేటికీ అది పూర్తికాలేదంటే వైసీపీ పాలనలో ఐదేళ్లూ ఏం అభివృద్ధి జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఇదీ రాజమహేంద్రవరం 9వ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో దుస్థితి..



అసంపూర్తిగా వదిలేసిన డ్రైనేజీ

- పేరుకే అఫీషియల్ కాలనీ..చుట్టూ సమస్యలే
- రహదారులన్నీ అధ్వానమే
- బర్మాకాలనీకి అందని తాగునీరు
- డ్రైనేజీల్లో అపారిశుధ్యం
- నెలల తరబడి నిర్మాణంలోనే కల్వర్టు
- రోడ్లపైనే ప్రవహిస్తున్న మురుగు
- ఇదీ రాజమండ్రి వెంకటేశ్వరనగర్ దుస్థితి

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మేడిపండు చూడ మేలిమై ఉండు.. పొట్ట విప్పి చూడ పురుగులుండు అన్నట్టు.. అచ్చంగా ఆ కాలనీ కూడా అలాగే ఉంటుంది. అది రాజమహేంద్రవరంలో ఆఫీషియల్‌గా కనిపించే వెనుకబడిన ప్రాంతం. ఎత్తయిన భవనాలు, పార్కులు, విశాలంగా కనిపించే వీధులతో పైకి చూస్తే అద్భుతంగా కనిపిస్తుంది. కానీ ఒకసారి లోపలకు వెళ్లి చూశామా పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్టు ఉంటుంది. భౌగోళికంగా రాజమహేంద్రవరంలోనే ఎత్తయిన ప్రదేశంలో ఉండే 9వ డివిజన్ నేటికీ అభివృద్ధిలో వెనుకబడే ఉంది. గత పాలకులు నిర్లక్ష్యం వల్ల 9వ డివిజన్‌లో 9 ప్రధాన సమస్యలకు పరిష్కారం లభించక కొట్టుమిట్టాడుతున్నాయి. వెంకటేశ్వర నగర్‌లో రహదారులు అధ్వానం, డ్రైనేజీ వ్యవస్థ దారుణం. పారిశుధ్య కార్మికుల కొరత ఉంది. చెరుకూరి కల్యాణ మండపం ఎదురుగా కల్వర్టు నిర్మాణానికి సుధాకర్ ఇన్‌ఫ్రా సిబ్బంది గోతులు తవ్వి మూడు నెలలు గడిచినా ఇంకా పూర్తికాలేదు. దీంతో రెండు వీధులకు సంబంధించి రాకపోకలు నిలిచిపోయాయి. కల్వర్టు నిర్మాణానికి డ్రైనేజీలను బ్లాక్ చేయడంతో మురుగునీరు రోడ్డెక్కుతోంది. దేవస్థానం భూమిని డంపింగ్ యార్డుగా మార్చివేశారు. విద్యుత్ కాలనీలో రెండు వీధులకు రహదారులు, డ్రైనేజీలు సమస్య ఉంది.16, 19 సచివాలయాలు చేరువగా లేక ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారు. ఏకేసీ క ళా శాల ప్రాం త ప్రజలు ప్రతి పనికి విద్యుత్ కాలనీకి వెళ్లే పరిస్థితి ఉంది. జయశ్రీ గార్డెన్స్, కోకభాస్కరనగర్ లోను డ్రైనేజీలు రహదారులు సమస్యలు ఉన్నాయి. అయినా నేటి వరకూ పరిష్కారానికి నోచుకోలేదు. ఎన్నో ఏళ్లగా సమస్యలు కాలనీవాసులను వెంటాడుతూనే ఉన్నాయి. గత ఐదేళ్ల కిందట అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం సమస్యలపై దృష్టి సారించింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కాలనీ అభివృద్ధి మాటే మరచింది. దీంతో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయి. రహదారులు అధ్వానంగా ఉన్నాయి.

బర్మాకాలనీకి తాగునీరేది..

తాగునీటి సమస్య అధికంగా ఉంది. రెండు వీధులకు తాగునీటి సరఫరాలేదు. ఫలితంగా వాటర్ ట్యాంక్‌పై ఆధారపడ్డారు. ట్యాంకర్ రాకపోతే తాగడానికి నీరుండదు. పారిశుధ్య సమస్య ఉంది. ఇంటింటా చెత్త సేకరణకు సీఎన్‌జీ వాహనాల కొరత ఉంది. ఇక్కడ కమ్యూనిటీ హాలులేదు. అంగన్‌వాడీకి ప్రత్యేక భవనం లేదు.

పార్కు ప్రైవేట్ పరం

గత పాలకులు వెంకటేశ్వరనగర్ వాటర్ ట్యాంక్ పక్కనే నగరపాలక సంస్థ స్థలంలో నిర్మించిన పార్కును ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. దీంతో లోపలకు సాధారణ ప్రజలు వెళ్లే పరిస్థితి లేదు. గతంలో మేయర్‌గా ఆదిరెడ్డి వీర రాఘవమ్మ ఉన్న సమయంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి పార్కు స్థలం కేటాయించా రు. ప్రకాశం నగర్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటి లిమిటెడ్‌కు కమ్యూనిటీ హాలు నిర్మించేందుకు అప్పటి మంత్రి దివంగత జక్కంపూడి రామ్మోహనరావు శంకుస్థాపన చేశా రు. అదే స్థలంలో పార్కును అభివృద్ధి చేసి దానిని ప్రైవేట్ సంస్థ కు అప్పగించారు. గత టీడీపీ ప్రభు త్వంలో వాటర్ ట్యాంక్‌కు 15వ ఆర్థికసం ఘం నిధులతో శంకుస్థాపన చేసారు. ఇప్పుడు వాటర్ ట్యాంక్ నిర్మాణం జరుగుతుండగా పార్కు మాత్రం ప్రైవేట్ సంస్థ చేతిలోకి వెళ్లింది.

చెత్త సేకరణ సక్రమంగా లేదు



విద్యుత్ కాలనీలో చెత్తసేకరణ సక్రమంగాలేదు. రోజుల తరబడి చెత్తను నిల్వచేయలేక రోడ్లపై వేసే పరిస్థితి ఉంది. డ్రైనేజీలు శుభ్రం చేసి చాలా రోజులైంది. చాలా సార్లు అధికారులకు పారిశుధ్యంపై ఫిర్యాదులు చేసినా స్పందన లేదు.
- పసుపులేటి మధు కిషోర్, విద్యుత్ కాలనీ

గోదావరి నీళ్ల సమస్య ఉంది..



బర్మాకాలనీలో గోదావరి నీళ్ల సమస్య ఉంది.గతంలో సమస్యను అప్పటి ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని దృష్టికి తీసుకువెళ్లాం.కేవలం బోరు నీటి పైనే ఆధారం. కానీ గోదావరి నీళ్లు సమృద్ధిగా లేవు.. కుళాయిలు పెంచాలి. కాలనీలో పందులు, కుక్కల బెడద అధికంగా ఉంది. శానిటేషన్ బాగోలేదు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్వయంగా దగ్గర ఉంటేనే పని జరుగుతుంది. లేకపోతే లేదు.
- నెల్లి సరస్వతి,గృహిణి, కుమారస్వామి వీధి

ఆ మూడు రోడ్లు వేయాలి..



వెంకటేశ్వరనగర్‌లో ఐఎంఏ హాలు ఉన్న రహదారి, దానికి అటుఇటు ఉన్న కొన్ని రహదారులు వేయడంలేదు. కనెక్టింగ్‌గా ఉన్న రహదారులు కల్వర్టుల నిర్మాణానికి తవ్వేశారు. ఇది జరిగి సు మారు 3నెలలు కావొస్తుంది. ఇప్పటికి వాటి నిర్మాణం పూర్తి కాలేదు.దీని వల్ల వెంకటేశ్వర నగర్ లోకి రావాలంటేనే ఇబ్బందిగా ఉంది.
- డాక్టర్ కే సంహిత్ వర్మ, వెంకటేశ్వరనగర్



జేఎన్ రోడ్డులో డ్రైనేజీ నిర్మాణం నిలిపివేయడంతో నిలిచిపోయిన మురుగునీరు

గత పాలకులు వ్యవస్థలను బ్రష్టుపట్టించారు..



9వ డివిజన్‌ను గత వైసీపీ పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. అనేక సమస్యలు ఉన్నాయి. రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ బాగోలేదు. పారిశుధ్యం నన్నగిల్లింది. తాగునీటికి ఇబ్బంది తప్పడంలేదు. వేసవి కాలం వచ్చిందంటే గోదావరి పక్కనే ఉన్నా గొంతు తడవడమే కష్టంగా ఉంది. వ్యవస్థలన్నింటిని గత ప్రభుత్వం నాశనం చేసింది. ఇప్పుడిప్పుడే ఎమ్మెల్యే వాసు వాటిని సరిచేసుకుంటూ వస్తున్నారు. తప్పక అతిత్వరలో 9వ డివిజన్‌లో సమస్యలన్నింటికి పరిష్కారం దొరుకుందనే నమ్మకం నాకు ఉంది.
- కోసూరి చండీప్రియ, మాజీ కార్పొరేటర్ 9వ డివిజన్



జేఎన్ రోడ్డులో పేరుకుపోయిన చెత్తలో పందుల సంచారం

మువ్వన్నెల జెండా రెపరెపలు

- ఘనంగా 76వ గణతంత్ర వేడుకలు
- జెండా ఆవిష్కరించిన నాయకులు, అధికారులు



కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న జిల్లా జడ్జి అనూరాధ



జిల్లా కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత



కొవ్వూరు మున్సిపల్ హైస్కూల్లో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి , మున్సిపల్ చైర్‌పర్సన్ భావన



నిడదవోలులో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి

కొవ్వూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర దినోత్సవాన కొవ్వూరు పట్టణ, మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో 9వ అదనపు జిల్లా జడ్జి డా. ఎం.అనూరాధ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఆర్డీవో డా. రాణి సుస్మిత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆర్డీవో కార్యాలయ ఏవో జి.ఎస్.ఎస్. జవహర్ బాజీ, డిప్యూటీ తహసీల్దార్‌లు కె.రవివిక్రమ్, సీహెచ్ ప్రజ్ఞావసంతి, ఎన్నికల డీటీ కె. నిరంజన్, సిబ్బంది పాల్గొన్నారు. కొవ్వూరు హోలీ ఏంజిల్స్ పాఠశాలలో కరస్పాండెంటు వలియవీడు నెల్సన్ ఆంటోని ఆధ్వర్యంలో పట్టణ సీఐ పి.విశ్వం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కొవ్వూరు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, నాయకులు పాల్గొన్నారు. నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కొవ్వూరు జనసేన కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టి.వి. రామారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కొవ్వూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ టి.నాగేంద్రకుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కమీషనర్ టి. నాగేంద్రకుమార్, తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ఎం.దుర్గాప్రసాద్, పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ పి. విశ్వం, ఆర్టీసీలో డిపో మేనేజర్ వై.వి.వి.ఎస్.కుమార్, కొవ్వూరు ఏబిఎన్, పీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో అవంతీ సంస్థల చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్, కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జె.సునీత, గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో ఏఈలు, పట్టణ, మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అలాగే గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జనసేన నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే టి.వి. రామారావు దొమ్మేరు జడ్పీ పాఠశాలలోని విద్యార్థులకు పరీక్షల ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు.

నిడదవోలు: భారతదేశ స్వాతంత్రం కోసం ఎంతో మంది మహ నీయులు చేసిన త్యాగాల ఫలితమే ఈరోజు అనుభవిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు అని మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి అన్నారు. నిడదవోలు మున్సిపల్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పతాక ఆవిష్కరణ చేసి మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆది నారాయణ, వైస్ చైర్మన్లు గంగుల వెంకటలక్ష్మి, బాలరాజు, కౌన్సిలర్లు అధికార్లు పాల్గొన్నారు.

చాగల్లు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆర్.శ్రీదేవి జెండా ఎగురవేయగా ఎంపీపీ వీరాస్వామి పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంవద్ద తహసీల్దార్ ఎం.మెరికమ్మ ఆవిష్కరించారు. స్థానిక హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు, టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు నాదెళ్ళ శ్రీరామ్ చౌదరి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరుటూరి సతీష్ పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు మోహనకృష్ణ జెండా ఆవిష్కరించారు. స్థానిక గ్రంథాలయంవద్ద, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కే.నరేంద్ర జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

నల్లజర్ల: తహసీల్దార్ కార్యాలయంవద్ద తహసీల్దార్ నాయుడు జాతీయ జెండా అవిష్కరించారు. డీటీ శాంతిప్రియా, వీఆర్వోలు చంద్రబాబు, సామ్యూల్, లక్షణమూర్తి,విఆర్ఏ సర్దార్ పాల్గొన్నారు. తెలికిచర్లలో సర్పంచ్ బండి చిట్టి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. నల్లజర్లలో మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించారు.

గోపాలపురం: గణతంత్ర దినోత్సవం మండలంలోని తహసీ ల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ అజయ్‌బాబు జెండా ఎగుర వేశారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్, జాతీపిత మహాత్మగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ సతీష్‌కుమార్, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో బీఎస్ఎస్ శ్రీనివాస్, గోపాలపురం పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి అనురాధ, ఆయా కార్యాలయాల వద్ద ప్రభుత్వ అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు.

దేవరపల్లి: దేవరపల్లి మండలంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉత్తమ అవార్డు తహసీల్దార్ కే.రాజ్య లక్ష్మీ తీసుకున్న సందర్భంగా రెవెన్యూ సిబ్బంది, అధికారుల సమక్షంలో తహసీల్దార్ కేక్‌కట్ చేసి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయంవద్ద ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, మండల విద్యాశాఖాధికారి తిరుమల దాసు, పంచాయతీ కార్యాలయం వద్ద కడిమి వీరకుమా రి, జనసేన పార్టీ కార్యాలయంవద్ద నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ సువర్ణరాజు, జెండాలను ఆవిష్కరించారు.

ఉండ్రాజవరం: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో రామారావు జాతీయజెండాను ఎగురవేశారు. ఎంపీపీ పి.ఎల్లారేశ్వరి సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలలోను జాతీయజెండాను ఆవిష్కరించి గణతంత్ర వేడుకలు నిర్వహించారు. పీఎస్‌డీ ప్రసాద్ ఉత్తమ తహసీల్థార్ అవార్డును జిల్లా కలెక్టర్ ప్రశాంతి నుంచి అందుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనను అభినందించారు.

తాళ్లపూడి: తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్థార్ బీరా రవీంద్రనాథ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులకు ప్రసంసాపత్రాలు అందించారు. మండల పరిషత్ కార్యాలయంవద్ద ఎంపీడీవో వెంకటరమణ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఎంపీపీ పోసిరాజు, వైస్ ఎంపీపీ కోదాటి కనకం, సిబ్బంది పాల్గొన్నారు. పోలీ స్టేషన్‌వద్ద ఎస్ఐ టి.రామకృష్ణ పతికావిష్కరణ చేశారు. అన్నదేవ రపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగున గణతంత్ర దినోత్సవ వేడుకలలో పారిశ్రామిక వేత్త గొరిజాల వెంకటప్రసాదు (జివి) పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థు లకు సూచించారు. పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ బంగార్రాజు, వైస్ చైర్మన్ చిన్నారి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. గజ్జరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ గండి రాంబాబు జాతీయ నాయకులు చిత్ర పటాలకు పూల మాలలు వేసి పతాకావిష్కరణ చేశారు. గాంధీ బొమ్మసెంటరులో మానవతా సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్ కుమార్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి పతాకావిష్కరణ చేశారు.

పెరవలి: మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అచ్యుతకుమారి పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సీహెచ్ వెంకట రమణ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసు స్టేషన్‌వద్ద ఎస్ఐ వెంకటేశ్వరరావు పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీలు రంగారావు, రాపాక ప్రమీల, సర్పంచ్ గంగోలు సీతమ్మ, ఆయా శాఖల అధికారులు సాయికుమార్, సూర్జాహన్, శ్రీనివాస్, శంకర్, సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు. పెరవలి ఎస్టీయు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు పద్మలత, ప్రసాద్, శాంతారావులను సన్మానించారు. సంఘ నాయకులు, అర్జునుడు, వెంకటేశ్వరరావు, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు పొందిన ఉద్యోగులు

కొవ్వూరు : విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు 76వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, జిల్లా ఎస్పీలు డి.నరసింహ కిషోర్‌లు అవార్డులతో సత్కరించారు. అవార్డులు పొందిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. కొవ్వూరు ఆర్డీవో డా.రాణి సుస్మిత, డిఎల్‌డివో ఎ.స్లీవారెడ్డి, డిఎస్పీ జి. దేవకుమార్, కొవ్వూరు పట్టణ ఎస్ఐలు కె. జగన్మోహనరావు, పి.రవీంద్రబాబు, రూరల్ ఎస్ఐ కె. శ్రీహరిరావు, పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి, ఆర్డీవో కార్యాలయ డిప్యూటీ తహసీల్థార్ కె.రవివిక్రమ్, సీనియర్ అసిస్టెంట్ కె. క్రాంతిరేఖ, జూనియర్ అసిస్టెంట్ ఎం.విజయలక్ష్మి, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది రవిరాజు, ఎం.రాజు, విద్యుత్‌శాఖ జూనియర్ అసిస్టెంట్ టి.క్రాంతికిరణ్, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ పి. రామకృష్ణ, డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ వి. కృష్ణకాంత్, డిప్యూటీ డిఎం&హెచ్‌వో డా. జె.సంధ్య, గవర్నమెంటు బాలుర జూనియర్ కళాశాల కామర్స్ లెక్చరర్ డి.మోహన్, అగ్నిమాపకశాఖ ఫైర్‌మేన్ వై. రాంబాబు, ఉద్యానవనశాఖాధికారి సిహెచ్. శ్రీనివాసరావు, మెప్మా సివో జి. కృపానందం, మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఈ. ప్రసాద్, ఎక్సైజ్ ఎస్ఐ ఈ. రవికుమార్, విలేజ్ సర్వేయర్ కె.ఈ.వి.ఎం. సాయిచరణ్, ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రి కాంపౌండర్ ఎస్.కె. రహిమాన్, సోషల్ వెల్ఫేర్ వసతిగృహ అధికారి ముప్పిడి రాజులకు 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో బాగంగా ఆదివారం రాజమహేంద్రవరంలో జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్‌లు ప్రసంసాపత్రాలు అందించి సత్కరించారు.

ఘనంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

జవహర్ జన్మదిన వేడుకలు



జవహర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

కొవ్వూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): టీడీపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి కె.యస్.జవహర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం కొవ్వూరులో పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య జవహర్ కేకు కట్ చేసి పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. జన్మదినాన్ని పురస్కరించుకుని ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి,నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు బూరుగుపల్లి వీరరాఘవులు, వేగి చిన్నా, బిక్కిన ఫణీంద్ర, కోడూరి ప్రసాద్, పసలపూడి బోసు, ముత్యాల రాంబాబు, ఆలపాటి సాయికృష్ణ, చిట్టూరి వెంకటేశ్వరరావు, పి.వి.వి. భద్రం, గీత ముళ్లపూడి దంత వైద్యులు డా. ముళ్లపూడి రాజేంద్రప్రసాద్, నాయకులు, కార్యకర్తలు జవహర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ సభ్యత్వాల్లో గోపాలపురం టాప్



విజయసంకేతం చూపిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

నల్లజర్ల, జనవరి26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వాల నమోదులో రాష్ట్రంలోనే గోపాలపురం నియోజనవర్గంలో ప్రథమస్థానంలో ఉందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. ఆదివారం రాత్రి నియోజకవర్గంలో సభ్యత్వాల నమోదు 70వేలు చేరిక జరగడంతో నల్లజర్ల పార్టీ కార్యాలయంలో విజయ సంకేతనం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో టీడీపీపై ప్రజల ఆధారణ మక్కువగా ఉందని, సీఎం చంద్రబాబుపై విశ్వాసం కలిగి ఉన్నట్లు పేర్కొన్నారు. పార్టీ విధి విధానాలను రూపొందించిన నారా లోకేష్‌పై కార్యకర్తలు మరింత నమ్మకం కలిగి పార్టీ సభ్యత్వాలను వేగవంతం చేశారని పేర్కొన్నారు. నియోజక వర్గంలోని ప్రతి గ్రామంలో నాయకులు సభ్యత్వాల పెంపుకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యద్దనపూడి బ్రహ్మరాజు, పసుమర్తి రతీష్,సింహ,శ్రీనివాస్,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన వ్యవసాయ విదానాన్ని నిరసిస్తూ ర్యాలీ

కొవ్వూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : దేశ స్వాతంత్ర్యం కోసం నడిపిన జాతీయోద్యమ లక్ష్యాలు ఇంకా నెరవేరలేదని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతాంగ వ్యతిరేక నూతన విధానాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం మోటారుసైకిళ్లపై నిరసన ర్యాలీ చేపట్టారు.

వ్యవసాయ వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ ర్యాలీ

గోపాలపురం, జనవరి 26(ఆంధ్రజ్యోతి) వ్యవసాయాన్ని కార్పొరేటీ కరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధా నాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ దొడిపూడి సెంటర్ ఏపీ రైతు కూలీ సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘాల ఆధ్వ ర్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షుడు కుంజం రామారావు మా ట్లాడుతూ డిల్లీలో రైతాంగం దేశవ్యాప్తంగా రైతువ్యతిరేక నాలుగు నల్లచట్టాలను రద్దు చేయాలన్నారు.

అనారోగ్యంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి



హెడ్‌కానిస్టేబుల్ మధుసూధనరావు పార్థీవ దేహానికి నివాళులర్పిస్తున్న సీఐ నాయక్

గోపాలపురం/దేవరపల్లి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గోపాలపురం పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సిర్రా మధుసూధనరావు ఆదివారం అనారోగ్యంతో కన్నుమూసినట్లు ఎస్ఐ కే.సతీష్‌కుమార్ తెలిపారు. 1993 బ్యాచ్‌కు చెందిన మధుసూధనరావు 32 సంవత్సరాలుగా పోలీసు విధులు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. సోమవారం పోలీసు లాంచనాలతో మధుసూ ధనరావు స్వగ్రామం అయిన దేవరపల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే దేవరపల్లి సీఐ బీఎన్.నాయక్, గోపాలపురం ఎస్సై సతీష్ మధుసూధనరావు పార్థీవ దేహాన్ని సందర్శించి ఆయన కుటుంబానికి సాను భూతి తెలిపారు.